PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 10 | విజయవాడ, ఆదివారం 10 ఆగస్టు 2025 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 10 August 2025 | Rs

ప్రాంతీయ పార్టీల ఓట్లు లేవ్!

- లాలూ, నితీశ్ నియోజకవర్గాల్లో భారీగా ఓట్లకు గండి
- ఛిద్రంగా బీహార్ ఎన్నికల ముఖచిత్రం
- 'సర్'తో లక్షలాది మంది ఓటుకు దూరం

5



విజయవాడ సన్ షైనర్స్ గెలుపు

- సెంచరీలు చేజార్చుకున్న పైలా అవినాష్, అశ్విన్ హెబ్బర్

6



విద్యార్థినుల భద్రతపై బుక్‌లెట్ విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు ఆదర్శ్ ఎం సాజి, శ్రీజన్ భట్టాచార్య, ఐషీ ఘోష్, ఎస్. శిల్ప, సూరజ్ ఎలామోన్

ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థినుల

స్వేచ్ఛ, భద్రతకు భంగం

- గత పదేళ్లలో పెరిగిన దాడులు
- ఆర్‌జి కర్ ఘటనకు ఏడాది
- ఎస్ఎఫ్ఐ బుక్‌లెట్ విడుదల

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో విద్యార్థినులు, మహిళలపై దాడులు పెరిగాయని ఎస్ఎఫ్ఐ నేతలు పేర్కొన్నారు. అలాగే ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థినుల స్వేచ్ఛ, భద్రతకు భంగం వాటిల్లుతోందని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీలో అత్యాచారం, హత్య ఘటన జరిగి ఏడాది అయిన నేపథ్యంలో దేశంలో లింగ ఆధారిత హింస, అన్యాయంపై శనివారం నాడిక్కడ ఎస్ఎఫ్ఐ కేంద్ర నాయకత్వం విలేకరుల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా "ఆర్.జి.కర్ ఘటన తరువాత మనం ఎక్కడ నిలబడతాం? లింగం, హింస, న్యాయం గురించి చర్చించడం" అనే బుక్‌లెట్ విడుదల చేశారు. సంస్థాగత స్థాయిలో అమలు చేయవలసిన ప్రధాన ప్రత్యామ్నాయాలను పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆదర్శ్ ఎం సాజి, శ్రీజన్ భట్టాచార్య, సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్, ఉపాధ్యక్షురాలు ఎస్. శిల్ప, కేంద్ర కమిటీ సభ్యుడు సూరజ్ ఎలామోన్ పాల్గొన్నారు.

నరేంద్ర మోడీ ప్రభుత్వం తొలిసారి అధికారంలోకి వచ్చిన 2014 నుంచి దేశవ్యాప్తంగా మహిళలు, విద్యార్థినుల పరిస్థితిని వివరించారు. 2025 నాటి వరల్డ్ ఎకనామిక్ ఫోరం గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్ట్ ప్రకారం 148 దేశాల్లో ఇండియా 131 స్థానంలో ఉందని అన్నారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్, బీహార్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో మహిళలపై జరిగిన నేరాల నమోదులో అనూహ్య పెరుగుదల ఉందని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో స్పష్టం చేస్తోందని గుర్తు చేశారు. దేశంలోని యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ నివేదిక ప్రకారం పాఠశాలల్లో బాలికల మిగతా 2లో

న్యాయం అడిగితే లాఠీలతో కొట్టారు

- ఆర్‌జి కర్ మృతురాలి తల్లిదండ్రులు

5

ఇజ్రాయిల్ ప్రణాళికతో

విధ్వంసమే

- ఐరాస చీఫ్ ఆందోళన
- గాజా స్వాధీనం చేసుకోవాలనే నిర్ణయానికి ఖండన

న్యూయార్క్ : గాజా స్ట్రిప్‌ను పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకోవాలనే ఇజ్రాయిల్ ప్రణాళికపై ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం ఇప్పటికే దారుణంగా ఉన్న పాలస్తీనియన్ల పరిస్థితిని మరింత దిగజారుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఒక ప్రకటనను విడుదల చేశారు. "గాజా నగరాన్ని తమ ఆధీనంలోకి తీసుకోవాలనే ఇజ్రాయిల్ ప్రభుత్వం నిర్ణయం నన్ను తీవ్రంగా ఆందోళనకు గురిచేసింది. ఈ నిర్ణయం ప్రమాదకరమైన తీవ్రతను సూచిస్తుంది. లక్షలాది మంది పాలస్తీనియన్లు ఇప్పటికే అనుభవిస్తున్న విపత్కర పరిణామాలను మరింత తీవ్రతరం చేస్తుంది. హమాస్ వద్ద ఉన్న మిగిలిన బందీలతో సహా మరింత మంది ప్రాణాలకు ముప్పు కలిగిస్తుంది' అని గుటెర్రెస్ ఈ ప్రకటనలో తెలిపారు. అలాగే, ఈ నిర్ణయంతో మరిన్ని బలవంతపు వలసలు, హత్యలు, భారీ విధ్వంసాలు జరుగుతాయని ఆయన హెచ్చరించారు. 'శాశ్వత కాల్పుల విరమణ, గాజాలోకి అడ్డంకులు లేని ప్రవేశాలు, బందీలందర్నీ తక్షణమే బేషరతుగా విడుదల చేయాలి' అని గుటెర్రెస్ మరోసారి పునరుద్ఘాటించారు. అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి ఉండాలని ఇజ్రాయిల్ ప్రభుత్వాన్ని కోరారు. 'చట్టవిరుద్ధమైన ఇజ్రాయిల్ ఆక్రమణలకు ముగింపు పలకకుండా, ఆచరణీయమైన రెండు దేశాల పరిష్కారాన్ని సాధించకుండా ఈ వివాదానికి ముగింపు రాదు. పాలస్తీనాలో గాజా అంతర్భాగంగా ఉంది. అలాగే ఉండాలి' అని గుటెర్రెస్ స్పష్టం చేశారు.

కాగా, గాజాను స్వాధీనం చేసుకోవాలనే ఇజ్రాయిల్ నిర్ణయంపై ఐరాస భద్రతా మండలి అత్యవసర సమావేశం శనివారం కాకుండా ఆదివారం జరగనుంది.

ఏజెన్సీలో

ప్రైవేటుకు దారులు

- 'టాటా'తో అరకు కాఫీ బ్రాండింగ్‌కు ఎంఒయు
- ఓయోకు టూరిజం హోమ్ స్టేలు
- అభివృద్ధి పేరిట 21 ఒప్పందాలు
- జిఒ 3కు ప్రత్యామ్నాయ మార్గాల్లో గిరిజనులకు మేలు చేస్తామని ప్రకటన
- పాడేరు ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సభలో సిఎం చంద్రబాబు



ఆదివాసీ దినోత్సవ సభలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి- పాడేరు (అల్లూరి జిల్లా)

గిరిజన ప్రాంతాల అభివృద్ధి, ఆదివాసీలకు జీవనోపాధి అవకాశాలు, వ్యవసాయ అభివృద్ధి, అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్, పర్యాటక రంగ ప్రోత్సాహం పేరిట ఏజెన్సీలో ప్రైవేటు కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం దారులు తెరిచింది. అల్లూరి జిల్లా పాడేరు మండలంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ సభ దీనికి వేదికైంది. మొత్తంగా 21 ఒప్పందాలు ప్రభుత్వ, ప్రైవేటు రంగంలోని వివిధ సంస్థల ద్వారా కుదిరాయి. అరకు కాఫీ మార్కెటింగ్ సహా వివిధ అటవీ, గిరిజన ఉత్పత్తులకు దేశీయంగానూ, విదేశాల్లోనూ మార్కెటింగ్ కల్పించేలా ఈ అవగాహనా ఒప్పందాలు కుదిరినట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. అల్లూరి మన్యం దశ దిశ మారుస్తానని, గిరిజన అభివృద్ధిలోనే దేశ ప్రగతి సాధ్యమని అన్నారు. పాడేరు మండలం లగిసపల్లి గ్రామంలో రెండు పంచాయతీల గ్రామాల ప్రజలతో ప్రభుత్వం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ గిరిజన సంక్షేమం, అభివృద్ధి పట్ల తనకు ఒక స్పష్టత, శ్రద్ధ ఉన్నాయన్నారు. నాడు గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు శ్రీకారం చుట్టి గిరిజనులకు ఉద్యోగ రిజర్వేషన్ కల్పిస్తే, దాన్ని తాను కొనసాగిస్తున్నామన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక గిరిజనులకే ఉద్యోగాలు కల్పించేందుకు గతంలో తాము జిఒ నెంబర్ 3 తీసుకొస్తే, అనంతరం కాంగ్రెస్, వైసిపి ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఆ జిఒ రద్దయిందని తెలిపారు. ఆ జిఒ స్థానంలో ప్రత్యామ్నాయ మార్గాల్లో గిరిజనులకు మేలు చేస్తామన్నారు. ప్రతి గిరిజన కుటుంబానికి ఉచితంగా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేయిస్తానని ప్రకటించారు. రూ.482 కోట్లతో గిరిజన ప్రాంతాల్లో ఐదు మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. డోలీ మోతలు లేకుండా 76 బర్త్ వెయిటింగ్ హాల్స్‌ను బలోపేతం చేశామన్నారు. 122 ఫీడర్ అంబులెన్సులు ఏర్పాటు చేశామని తెలిపారు.

లక్ష ఎకరాల్లో కొత్తగా కాఫీ తోటలు

గిరిజనులు పండిస్తున్న అరకు కాఫీని ప్రపంచానికి పరిచయం చేస్తున్నామని, ప్రస్తుతం పాడేరు ఏజెన్సీలో 11 మండలాల్లో 2.58 లక్షల ఎకరాల్లో కాఫీ సాగవుతోందని, ఇప్పుడు మరో లక్ష ఎకరాల్లో కొత్తగా కాఫీ తోటలను ప్రోత్సహించేందుకు చర్యలు చేపడుతున్నామని చంద్రబాబు తెలిపారు.

గ్రామీణ సడక్ యోజన కింద ప్రతి గిరిజన గ్రామానికీ రోడ్డు

1,483 గిరిజన హేబిటేషన్లలో రూ.2,850 కోట్ల వ్యయంతో గ్రామీణ సడక్ యోజన కింద ప్రతి ఊరికీ రోడ్డు వేస్తామని చంద్రబాబు ప్రకటించారు. రూ.8,575 కోట్ల వ్యయంతో 515 మిగతా 2లో

ప్రమాదంలో ఆదివాసీల ఉనికి

'మన భూమి, మన సంస్కృతి కోసం పోరాటం
ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సభలో వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరించడం వల్ల ఆదివాసీల ఉనికికి పెను ప్రమాదం ఏర్పడిందని సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. వారి భూములను లాగేసుకోవడంతో పాటు సంస్కృతిని నాశనం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సిపిఎం రాష్ట్రకమిటీ ఆధ్వర్యంలో విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో శనివారం జరిగింది. ఆదివాసీ గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర అధ్యక్షత వహించిన ఈ సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతిని నాశనం చేసేందుకు అధిపత్య సంస్కృతిని వారిపై రుద్దుతున్నారని తెలిపారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇది తీవ్రమైందన్నారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములను బలవంతంగా లాగేసుకుంటుంన్నారని, వారికి కనీస సౌకర్యాలు కల్పించని ప్రభుత్వాలు అటవీ సంపదను దోచుకునేందుకు జాతీయ రహదారులను



ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన ఆదివాసీ దినోత్సవ సభలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరరావు

నిర్మిస్తోందన్నారు. తమ గ్రామాలను ప్రధాన రహదారులతో కలుపుతూ రోడ్లు, బ్రిడ్జిలు నిర్మించాలని కోరుతున్నా పట్టించుకొవడం లేదని తెలిపారు. మన్యం జిల్లాలో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు పేరుతో ఏడు వేల ఎకరాల గిరిజనుల భూముల్లో వారికి తెలియకుండానే సర్వే రాళ్లు వేశారని తెలిపారు. చట్టాలను అమలు చేయాల్సిన ప్రభుత్వమే చట్టాలను ఉల్లంఘిస్తోందన్నారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన అరకు కాఫీ ఆదివాసీల హక్కు అని, దీనిని కార్పొరేట్ బ్రాండ్‌గా లాగేసుకుంటున్నారని తెలిపారు. ఈ కాఫీ పండిస్తున్న రైతులకు ప్రభుత్వం బకాయిలు చెల్లించడం లేదన్నారు. జివో 3కి ఆర్డినెన్స్ తీసుకొచ్చి ఏజెన్సీలో స్థానిక ఆదవాసీలకే ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న భాషా వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఆదివాసీల సమస్య ప్రజలందరిదీ అని, అందరితో పాటు వారు కూడా సమానంగా అభివృద్ధి అయితేనే నిజమైన అభివృద్ధి అని మిగతా 2లో

సీలేరు వద్ద 'మేఘా' బరితెగింపు

ప్రజాశక్తి - సీలేరు (అల్లూరి జిల్లా)

పర్యావరణ అనుమతులు రాకుండానే అల్లూరి జిల్లా జికె వీధి మండలం సీలేరులో గుట్టు చప్పుడు కాకుండా పంప్డ స్టోరేజ్ ప్రాజెక్టు పనులను మేఘా కంపెనీ ప్రారంభించింది. శనివారం ఉదయం పార్వతీనగర్ సమీపంలో ఈ ప్రాజెక్టు పనులకు ఆ సంస్థ ప్రతినిధులు శంకుస్థాపన చేశారు. విషయం తెలుసుకున్న నిర్వాసితులు తమకు న్యాయమూ చేయకుండానే పనులు ఎలా చేపడుతారని ప్రశ్నించారు. నిర్వాసితుల గురించి తేల్చకుండా పనులు ప్రారంభించడం దారుణమని స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘం నాయకులు తెలిపారు. ఇదే విషయమై ఎపి జెన్కో పంప్డ స్టోరేజ్ ప్రాజెక్టు ఎడిఇ అప్పలనాయుడును, 'మేఘా' ఎజిఎం రవిబాబును నిలదీశారు. ఎడిఇ అప్పలనాయుడు స్పందిస్తూ..రాఖీ పౌర్ణమి రోజు మంచిదని 'మేఘా' శంకుస్థాపన చేసిందని, అధికారికంగా ప్రారంభించాల్సివుందని సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. నిర్వాసితులు ఎదురు తిరగడంతో ఆయన అక్కడి నుంచి జారుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాయింట్ దుర్జో, టిడిపి నాయకులు చిటికెల రాము, కాశీ, కాంగ్రెస్ నాయకులు కాలే శ్రీనివాస్, గిరిజన సంఘం నాయకులు మార్కు రాజు, మనోజ్ పాల్గొన్నారు.

రోడ్లు రక్తసిక్తం

- వేర్వేరు ప్రమాదాల్లో తొమ్మిదిమంది దుర్మరణం
- కుమారుడి మరణవార్త విని గుండె ఆగి తండ్రి మృతి
- పదికి చేరిన మృతుల సంఖ్య



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన వాహనం

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్రంలో శనివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో తొమ్మిది మంది దుర్మరణం చెందారు. దీంతో, రోడ్లు రక్తసిక్తమయ్యాయి. కుమారుడి మరణ వార్త విని ఓ తండ్రి మృతి చెందారు. మృతుల సంఖ్య పదికి చేరింది. పోలీసుల కథనం ప్రకారం... పల్నాడు జిల్లా మాచర్ల మండలం కొత్త గణేష్‌పురం గ్రామానికి చెందిన నంబూరి వెంకటేశ్వర్లు, సుభాషిణి (30) దంపతులు తమ కుమారుడు అభినయ కృష్ణ (2) పుట్టెంట్రుకలను తిరుమల వెంకటేశ్వరస్వామికి సమర్పించేందుకు కుటుంబసభ్యులు, సమీప బంధువులతో కలిసి తుఫాను వాహనంలో వెళు_న్నారు. నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం చాగొల్లు సమీపంలో వారి వాహనం ముందు వెళ్తున్న ట్రాలీ లారీని ఓవర్ టేక్ చేయబోయి దానిని ఢీకొట్టి రోడ్డుపై బోల్తాపడింది. దీంతో, వెంకటేశ్వర్లు భార్య సుభాషిని, తల్లి వెంకట నరసమ్మ (55) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఆస్పత్రికి తరలిస్తుండగా కోన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ అభినయ కృష్ణ మార్గమధ్యంలో తన తండ్రి చేతుల్లో ప్రాణాలు విడిచాడు. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లు మేనత్త రుక్మిణమ్మ (55), మావయ్య ఎర్రం శ్రీనివాసులు (60) కావలి వైద్యశాలలో చికిత్స పొందుతూ మరణించారు. ఈ ప్రమాద సమయంలో తుఫాను వాహనంలో డ్రైవర్ సహా 11 మంది ఉన్నారు. ఐదుగురు మృతి చెందగా, మిగిలిన ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. వాహనం నుజ్జునుజ్జు అయింది. తూర్పుగోదావరి జిల్లా కడియపులంక నర్సరీలో పని చేసేందుకు బైక్‌పై వెళ్తున్న పెరవలి మండలం కానూరు అగ్రహారానికి చెందిన కార్మికులు లంకే దుర్గాప్రసాద్ (26), దవులూరి సుబ్రమణ్యం (42)లను సీతంపేటలో టిప్పర్ మిగతా 2లో

ఆపరేషన్ సిందూర్ ఎందుకు ఆగింది?

ఎయిర్ చీఫ్ మార్షల్ ప్రకటన తరువాత మోడీకి కాంగ్రెస్ ప్రశ్న

న్యూఢిల్లీ : మే 10న ఆపరేషన్ సిందూర్‌ను ఎందుకు ఆపారని ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కాంగ్రెస్ శనివారం సూటిగా ప్రశ్నించింది. ఈ ఆపరేషన్‌లో ఆరు పాకిస్తాన్ యుద్ధవిమానాలను కూల్చివేశామని ఎవరి ఒత్తిడితో భారత వైమానిక దళం ప్రకటించిందని కాంగ్రెస్ నిలదీసింది. బెంగళూరులో ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్తాన్‌కు చెందిన ఐదు ఫైటర్ జెట్లను, ఒక భారీ యుద్ధవిమానాన్ని కూల్చివేశామని ప్రకటించారు. ఉపరితలం నుంచి గగనతల దాడుల్లో ఇప్పటి వరకూ భారత్ నమోదు చేసిన అతిపెద్ద విజయంగా దీన్ని వర్ణించారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ స్పందించారు. 'ఈ రోజు ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ చేసిన నూతన ప్రకటనతో మే 10న సాయంత్రం ఆపరేషన్ సిందూర్‌ను ప్రధాని మోడీ ఆకస్మాత్తుగా ఎందుకు ఆపారో అనే విషయం మరింత దిగ్భ్రాంతికరంగా ఉంది' అని జైరాం రమేష్ ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ప్రధానిపై ఒత్తిడి ఎక్కడి నుంచి వచ్చింది. ఆయన ఎందుకు అంత త్వరగా లొంగిపోయారు?' అని ప్రశ్నించారు.

బెంగళూరులో శనివారం నిర్వహించిన మాజీ ఎయిర్ చీఫ్ మార్షల్ ఎల్ఎం కాత్రే స్మారక ఉపన్యాసంలో అమర్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్తాన్‌కు చెందిన ఐదు ఫైటర్ జెట్లను, ఒక భారీ యుద్ధవిమానాన్ని కూల్చివేశామని ప్రకటించారు. రష్యా తయారీ ఎస్-400ను గేమ్ ఛేంజర్‌గా పేర్కొన్నారు. ఉపరితలం నుంచి గగనతలానికి ప్రయోగించే క్షిపణి వ్యవస్థను పాకిస్తాన్ ఛేధించలేకపోయిందని చెప్పారు. మన వాయు రక్షణ వ్యవస్థలు అద్భుతంగా పని చేశాయని తెలిపారు. పాకిస్తాన్‌లోని జాకోబాబాద్, భోలారిల్లో స్థావరాలపై దాడి చేశామని, కొన్ని ఎఫ్-16 విమానాలు ధ్వంసమయ్యాయని చెప్పారు. భారత దళాలు చాలా నష్టం కలిగించాయని, దీంతో వివాదం కొనసాగితే మరిన్ని నష్టాలను చవిచూస్తామని పాకిస్తాన్ గ్రహించిందని అన్నారు. దీంతోనే కాల్పుల విరమణను పాక్ కోరిందని తెలిపారు.



మద్యం ఆదాయం ఫుల్ జోష్

- ఖజానాకు రూ.వేల కోట్ల రాబడి
- డీజిల్ వాహనాల సంఖ్య పెరిగినా.. తగ్గిన ఇం'ధనం'

3

ఆ ఉత్తర్వులకు నిరసనగా 13, 14 తేదీల్లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

- విద్యార్థి సంఘాల పిలుపు

రెండేళ్లుగా బకాయిలు

- ఎంపిటిసిలకు అందని గౌరవ వేతనం
- ప్రొటోకాల్‌కు సైతం నోచని వైనం!

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రజలు ఎన్నుకున్న ఎంపిటిసి సభ్యులకు గౌరవం దక్కడం లేదు. ప్రభుత్వం కనీసంగానైనా వారిని పట్టించుకోవడం లేదు. టిడిపి కూటమి సర్కారు తమపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఎంపిటిసి సభ్యులు వాపోతున్నారు. రెండేళ్లుగా గౌరవ వేతనానికి నోచుకోవడం లేదని, బకాయిలు చెల్లించాలని వారు కోరుతున్నా పట్టించుకొనే నాధుడు కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సంస్థల్లో కీలకంగా వ్యవహరించా ల్సిన తమను ప్రభుత్వ కార్యక్రమాలకు సైతం అధికారులు ఆహ్వానించడం లేదంటూ ఆవేదన చెందుతున్నారు. ఇటీవల ప్రభుత్వం అనేక కార్య క్రమాలు అమలు చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో సర్పంచుల అధ్యక్షతన ప్రజలకు పలు సంక్షేమ పథకాలను అందజేస్తోంది. వాటిలో ఎంపిటిసి సభ్యులను భాగస్వామ్యం చేయాల్సి ఉన్నా, వీరికి గౌరవం దక్కడం లేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1,184 మంది ఎంపిటిసి సభ్యులు ఉన్నారు. 2021 సెప్టెంబర్ చివరి వారంలో వీరు ప్రమాణ స్వీకారం చేశారు. వీరికి నెలకు రూ.3 వేల చొప్పున ప్రభుత్వం గౌరవ వేతనం అందజేయాల్సి ఉంది. అక్టోబర్ నుంచి ఈ ఏడాది జూన్ నాటికి 45 నెలలు పూర్తయింది. 21 నెలల గౌరవ వేతనం మాత్రమే వారికి అందింది. ఇంకా 24 నెలల గౌరవ వేతనం బకాయి ఉంది.

నిధుల కేటాయింపూ లేదు

గత ప్రాదేశిక ఎన్నికల సమయంలో వైసిపి అధికారంలో ఉండడంతో ఆ పార్టీకి చెందిన దాదాపు 80 శాతం మంది ఎంపిటిసి సభ్యులుగా గెలుపొందారు. టిడిపి ప్రభుత్వం తమకు నిధులు కేటాయించడం లేదని వారు చెప్తున్నారు. గతంలో పిఆర్‌జిఎఫ్, ఆర్థిక సంఘం నిధుల్లో 50 శాతం జిల్లా పరిషత్తుకు కేటాయించేవారు. వీటితో గ్రామాల్లో అభి వృద్ధి పనులను ఎంపిటిసి సభ్యులతో చేయించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. 14వ ఆర్థిక సంఘం నిధులు నేరుగా పంచాయతీలకే కేటాయించారు. ఇప్పుడు 15 ఆర్థిక సంఘం నిధులు నేటికీ విడుదల కాలేదు. పంచాయతీలకు నిధులు అందుబాటులో ఉన్నా ప్రభుత్వాలు ఎంపిటిసి సభ్యులకు మాత్రం నిధులు కేటాయించడం లేదు. పేరుకు మాత్రమే వీరు సభ్యులుగా ఉంటున్నారు.

వెంటనే చెల్లించాలి



టిడిపి కూటమి ప్రభుత్వం తక్షణం స్పందించి ఎంపిటిసి సభ్యులకు బకాయి గౌరవ వేతనాన్ని వెంటనే విడుదల చేయాలి. గత ప్రభుత్వ హయాంలో సక్రమంగానే విడుదల చేసినప్పటికీ ఈలోపు సార్వత్రిక ఎన్నికలు రావడంతో వేతనాలు నిలిచిపోయాయి. పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్న పవన్ కల్యాణ్ స్పందించి మాకు వేతనాలు విడుదల అయ్యేలా చూడాలి.

-ఎం.నానిబాబు, ఎంపిటిసి సభ్యులు, వెల్దుర్తి, పిఠాపురం మండలం

ప్రభుత్వ కార్యక్రమాలకు పిలవడం లేదు



ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులమే అయినా మమ్మల్ని చాలాచోట్ల ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదు. టిడిపి కూటమి అధికారం లోకి వచ్చిన తర్వాత మమ్మల్ని పక్కన పెట్టింది. ఏ సంబంధమూలేని అధికార పార్టీ నాయకులు అధికారిక కార్యక్రమాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు సైతం వారికే వత్తాసు పలికి ప్రొటోకాల్‌ను ఉల్లంఘిస్తున్నారు.

-అడపా రఘు, ఎంపిటిసి సభ్యులు, విరవాడ, పిఠాపురం మండలం

దాచేపల్లి బీసీ హాస్టల్‌లో దారుణం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా దాచేపల్లిలోని బాలుర బీసీ హాస్టల్లో దారుణం జరిగింది. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిపై సీనియర్ విద్యార్థులు విచక్షణా రహితంగా దాడి చేశారు. దాడి దృశ్యాలను వీడియోలో చిత్రీకరించారు. గురువారం జరిగిన ఈ సంఘటన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. దాచేపల్లికి సమీపంలోని శ్రీనగర్‌కు చెందిన విద్యార్థి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతూ బిసి హాస్టల్లో ఉంటున్నాడు. స్థానిక ఓ ప్రయివేటు కాలేజీలో ఇంటర్ మీడియట్ చదువుతున్న అమ్మాయితో చనువుగా మాట్లాడు తున్నాడని అతనిపై హాస్టల్‌కు చెందిన ఇద్దరు సీనియర్ విద్యార్థులు, మరో ముగ్గురు యువకులతో కలిసి గురువారం రాత్రి హాస్టల్ గదిలో దాడి చేశారు. కాళ్లతో విచక్షణారహితంగా తన్నారు.

దండం పెడుతున్నా విడిచిపెట్టకుండా దాడిని కొనసాగించారు. కరెంట్ వైరుతో షాక్ ఇచ్చేందుకు ప్రయత్నించారు. తనపై జరిగిన దాడిని మరుసటి రోజు శుక్రవారం బాధిత విద్యార్థి వార్డెన్‌కు చెప్పగా ఆమె పోలీసులకు సమాచారం ఇచ్చారు. హాస్టల్‌కు వచ్చిన పోలీసులు విచారణ చేసి... విద్యార్థుల మధ్య సాధారణ వివాదమని భావించి వెళ్లిపోయారు. అయితే, శనివారం మధ్యాహ్నం దాడి ఘటన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో దాడి తీవ్రతను పోలీసులు గుర్తించారు. దాడికి పాల్పడిన ఐదుగురిలో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నట్టు గురజాల డిఎస్‌పి జగదీష్ మీడియాకు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. ఇదిలా ఉండగా దాడిలో కీలకమైన యువకుడు గతంలోనూ పలుమార్లు 25 మంది వరకు విద్యార్థులపై దాడి చేశాడని, అప్పుడు కూడా అమ్మాయి విషయమే కారణమని తెలిసింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ట్రంప్ పేకమేడ కూలడం ఖాయం


- అమెరికన్ ఆర్థికవేత్త స్టీవ్ హాంకీ

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ టారిఫ్ వార్‌పై స్వదేశంలోనూ వ్యతిరేకత ఎదురవుతోంది. ఈ సుంకాల వల్ల అమెరికా ప్రజలకే ఎక్కువ నష్టం వాటిల్లనుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా అమెరికా ఆర్థికవేత్త, జాన్ హాప్‌కిన్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ స్టీవ్ హాంకీ కూడా ఇదేవిధమైన అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. 'తనను తాను నాశనం చేసుకునే శత్రువు జోలికి వెళ్లకపోవడమే మంచిదనేది నెపోలియన్ మాట. ఇప్పుడు ట్రంప్ కూడా ప్రపంచదేశాలతో వాణిజ్య యుద్ధాలు చేస్తూ తనను తానే నాశనం చేసుకుంటున్నారని అనిపిస్తోంది. అని అన్నారు. సుంకాల పేరుతో ట్రంప్ కడుతున్న పేక మేడ త్వరలోనే కూలిపోతుందని దుయ్యబట్టారు. అప్పటివరకు భారత్ ఆయన జోలికి వెళ్లకపోవడమే మంచిదని సూచించారు.

జాతీయమీడియాతో మాట్లాడిన స్టీవ్ హాంకీ.. భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాల అంశాన్ని ప్రస్తావించారు. "సుంకాలపై ట్రంప్ నిర్ణయాలు పూర్తిగా అర్థరహితం. ఇక్కడో విషయం చెప్పాలి. భారత్ విషయానికొస్తే.. ప్రస్తుతం ప్రధాని మోడీ, విదేశాంగ మంత్రి జైశంకర్ కొంతకాలం ఓపిక పట్టి ఎదురుచూడాలి. ఎందుకంటే ట్రంప్ పేకమేడ త్వరలోనే కూలిపోతుంది" అని ఆ ప్రొఫెసర్ అభిప్రాయపడ్డారు.



సంప్రదాయ నృత్యంతో అలరిస్తున్న ఆదివాసీలు



సభా వేదికపై అభివాదం చేస్తున్న మిడియం బాబూరావు, రమాదేవి, ఆదివాసీ నేతలు

ఘనంగా కోయ్‌త్తోర్ పండూం దక్కట్

- ఆకట్టుకున్న నృత్యాలు, కళలు
- గిరిజనుల హక్కులను కాలరాస్తే ఊరుకోం : మిడియం బాబూరావు

ప్రజాశక్తి - కూనవరం (అల్లూరి జిల్లా)

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కోయ్‌త్తోర్ పండూం దక్కట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పోలవరం నిర్వాసిత మండలాలైన కూనవరం, విఆర్.పురం, ఎటపాక, చింతూరు నుంచి సుమారు 3500 మంది గిరిజనులు దారిపొడవునా కొమ్ముకోయ, ఆదివాసీ నృత్యాలతో అల్లూరి జిల్లా కూనవరం మండలంలోని స్థానిక ఉన్నత పాఠశాల ప్రాంగణానికి చేరుకున్నారు. అక్కడి నుంచి ఉదయ భాస్కర్ థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన సభాస్థలి వరకూ భారీ ప్రదర్శన చేపట్టారు.

ఆదివాసీ జెండాను సిపిఎం మాజీ ఎంపి, ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ్ మంచ్ జాతీయ నాయకులు మిడియం బాబూరావు ఆవిష్కరించారు. అనంతరం ఆదివాసీ అమరులు అల్లూరి సీతారామరాజు, బిర్సా ముండా, కొమరం భీమ్, కుంజా బొజ్జి, సున్నం రాజయ్యల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, స్థానిక జడ్‌పిటిసి గుజ్జా విజయ, ఎంపిపి పాయం రంగమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంప్రదాయ కొమ్ము కోయ, ఆదివాసీ పెళ్లి, థింసా, అందె నృత్యాలు, కళారూపాలతో సభా ప్రాంగణం హోరెత్తింది. బాబూరావు మాట్లాడుతూ... ఆదివాసీ పోరాటాలు మన ప్రాంతంలో 1803లోనే మొదలయ్యాయని, హక్కుల కోసం పోరాడే వారే నిజమైన ఆదివాసులని తెలిపారు. ప్రస్తుతం ఆదివాసీ చట్టాలను కాలరాస్తూ గిరిజనులను అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. ఏజెన్సీలోని వనరులను అదానికి అప్పజెబుతూ అడవిని ఖాళీ చేస్తోందన్నారు. చెట్టు, పుట్టలను నమ్ముకొని బతుకుతున్న గిరిజన ప్రజానీకాన్ని అడవికి దూరం చేస్తోందని, మోడీ సర్కారు అవలంభిస్తోన్న ఆదివాసీ వ్యతిరేక విధానాలను పోరాటాలతో తిప్పికొట్టాలన్నారు. ఆదివాసీలను ఆదివాసీలే పరిపాలించుకోవాలని, భాష, సంస్కృతులను కాపాడుకోవాలని అన్నారు. మార్కెట్, కార్పొరేట్ శక్తులు ఈ ప్రాంతంలోకి రాకుండా పోరాడాలని కోరారు. దేశ వ్యాప్తంగా గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు సంబంధించి 40 లక్షలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ.. ఆదివాసీలకు ఏజెన్సీలో 100 శాతం ఉద్యోగాలు కల్పించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఆదివాసీ యువత అభ్యుదయ మార్గంలో నడవాలని ఆకాంక్షించారు. గిరిజన సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించాలన్నారు. పోలవరం నిర్వాసితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయం చేయాలన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మాట్లాడుతూ.. నేటికీ ఏజెన్సీలో డోలీ మోతలే శరణ్యమవుతున్నాయని, ఆదివాసీ చట్టాలు సక్రమంగా అమలు కావడం లేదని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం ఎఎస్‌ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్, వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, ఎంపిటిసిలు అమ్మాజీ, జయసుధ, పూనెం ప్రదీప్ కమార్, సర్పంచులు బొగ్గ వెంకమ్మ, శంకర్, బొగ్గా రామారావు, నాయకులు పాయం సీతారామయ్య, తెల్లం తమ్మయ్య, బాబు బొర్రయ్య, కారం సుందరయ్య, పల్లపు వెంకట్ పాల్గొన్నారు.

సత్వర న్యాయం, పోలీసింగ్‌లో రాష్ట్రాన్ని నెంబరు 1గా చేయడమే లక్ష్యం

- సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సత్వర న్యాయంలో రాష్ట్రాన్ని నెంబరు 1గా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తున్నామని సిఎం చంద్రబాబు తెలిపారు. ప్రజలకు న్యాయ సహాయం, పోలీసింగ్ సహా వివిధ కేటగిరీల్లో దేశంలోనే రెండో స్థానంలో నిలిచినప్పటికీ రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలబెట్టేంత వరకు నిర్విరామంగా పనిచేస్తామన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీసింగ్‌తో సహా వివిధ అంశాల్లో దేశంలోనే రెండో స్థానంలోనూ, శాంతి భద్రతల్లో రాష్ట్రం టాప్‌గా ఉందని ఇండియా జస్టిస్ రిపోర్టు-2025 వెల్లడించిందన్నారు. శాంతి భద్రతలు, సత్వర న్యాయం, న్యాయ వ్యవస్థ పనితీరు, సామాజిక చట్టపరమైన పాలన తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఇండియా జస్టిస్ సంస్థ రాష్ట్రానికి ర్యాంకింగ్ ఇచ్చిందని సిఎం తెలిపారు. జగన్ ప్రభుత్వ హయాంలో రాజకీయ ప్రతీకారాలు, ప్రతిపక్ష నేతలను టార్గెట్ చేసేందుకు పోలీస్ వ్యవస్థను దుర్వినియోగం చేయడంతో రాష్ట్రం ర్యాంకింగ్ దిగజారిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో చట్టబద్ధ పాలన తిరిగి వచ్చినట్లు ఇండియా జస్టిస్ రిపోర్టులో పేర్కొందన్నారు. ఇండియా జస్టిస్ రిపోర్టులో 6.78 స్కోర్‌తో కర్ణాటక మొదటి స్థానంలో నిలవగా, మన రాష్ట్రం 6.32 స్కోర్‌తో రెండో స్థానంలో నిలిచిందని సిఎం తెలిపారు.

దేశంలో 334 రాజకీయ పార్టీలపై ఇసి వేటు

న్యూఢిల్లీ : దేశంలోని 334 రాజకీయ పార్టీలపై ఎన్నికల సంఘం (ఇసి) వేటు వేసింది. దేశంలో గుర్తింపు పొందని 334 రాజకీయ పార్టీల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం సవరించింది. వాటిని జాబితా నుంచి తొలగించింది. నిబంధనల మేరకు ... ఇసి వద్ద నమోదైన రాజకీయ పార్టీలు ఆరేళ్లలో కనీసం ఒక్క ఎన్నికలోనైనా పోటీ చేయాల్సి ఉంటుంది. అయితే ఈ 334 పార్టీలు 2019 నుంచి ఒక్క ఎన్నికలోనూ బరిలోకి దిగకపోవడంతో వాటిపై ఇసి వేటు వేసింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 334 పార్టీలను జాబితా నుంచి తొలగించినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. పేరుకు పార్టీలు పెట్టినప్పటికీ, వీటికి భౌతికంగా ఎలాంటి కార్యాలయాలు అందుబాటులో లేవని స్పష్టం చేసింది. ఇప్పటివరకు దేశంలో 2,854 గుర్తింపు పొందని పార్టీలు ఇసి వద్ద రిజిస్టర్ అయి ఉన్నాయి. తాజా చర్యతో ఆ సంఖ్య 2,520 కి తగ్గింది. ఎన్నికల సంఘం వద్ద ఉన్న డేటా ప్రకారం ... ప్రస్తుతం దేశంలో ఆరు జాతీయ పార్టీలుగా కొనసాగుతున్నాయి. 67 ప్రాంతీయ రాజకీయ పార్టీలు మనుగడలో ఉన్నాయి.

ఆరు జాతీయ పార్టీలివే..
భారతీయ జనతా పార్టీ (బిజెపి)
ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (ఐఎన్‌సి)
భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి)
ఆమ్ ఆద్మీ పార్టీ (ఎఎపి)
నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి)

కోల్ మాల్

- జెన్‌కో ప్లాంట్లకు నాసిరకం బొగ్గు సరఫరా
- మరమ్మతులకు గురవుతున్న యూనిట్లు
- తగ్గిన విద్యుత్ ఉత్పత్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జెన్‌కో ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లకు నాసిరకం బొగ్గు అందుతోంది. దీంతో ప్లాంట్లు తరచు మరమ్మతులకు గురవుతున్నాయి. గత 50 రోజుల్లో జెన్‌కో ఆధ్వర్యంలో నడుస్తున్న మూడు విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లలోని అన్ని యూనిట్లు ఏ ఒక్కరోజూ పూర్తిగా పనిచేయలేదు. మూడు ప్లాంట్లల్లో ఏదో ఒక యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోతోంది. జెన్‌కో ఉత్పత్తి నిలిచిపోవడంతో విద్యుత్ డిమాండ్‌ను అందుకునేందుకు డిస్కమ్‌లు బయట మార్కెట్ నుంచి అధిక ధరకు విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నాయి. రాష్ట్రంలో జెన్‌కో ఆధ్వర్యంలో మూడు విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు ఉన్నాయి. 1650 మెగావాట్ల(మెవా)సామర్థ్యంతో కడపలోని రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్(ఆర్‌టిపి), 2400 వాట్లతో నెల్లూరులోని శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ ప్లాంట్(ఎస్‌డిఎస్‌టిపి), 2560 మెవాతో విజయవాడలోని నార్లా తాతారావు పవర్ ప్లాంట్(ఎన్‌టిపిపి) ప్రాజెక్టులు ఉన్నాయి. వీటికి సింగరేణి, మహానది బొగ్గు గనుల తో పాటు ఈస్టరన్ కోల్‌ఫీల్డ్ లిమిటెడ్(ఇసిఎల్) నుంచి బొగ్గు అందుతోంది. సింగరేణి, మహానది నుంచి టన్నుకు సుమారు రూ.5వేలు, ఇసిఎల్ నుంచి సుమారు రూ.7వేలకు జెన్‌కో కొనుగోలు చేస్తోంది. సింగరేణి, మహానది నుంచి జెన్‌కో ప్లాంట్లకు నాసిరకం బొగ్గు అందుతోందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. రా కోల్(ముడి బొగ్గు) ఎక్కువగా ఉంటుందని, ఇందులో మట్టి కూడా కలుస్తోందని అంటున్నారు. దీనివల్ల ప్లాంట్లు



ప్రతిసారి మరమ్మతులకు గురవుతున్నాయని చెబుతున్నారు. మూడు ప్లాంట్లలో 100 శాతం ఉత్పత్తి నడిస్తే సుమారు 158 మిలియన్ యూనిట్ల(ఎంయు) ఉత్పత్తి జరగాలి. కానీ మూడు కలిపి 100 ఎంయులు కూడా దాడటం లేదు. నాసిరకం బొగ్గు రావడం వల్లే ఉత్పత్తి తగ్గుతోందని జెన్‌కో అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 22న ఎస్‌డిఎస్‌పిటిలోని యూనిట్-3 90శాతం పిఎల్‌ఎఫ్‌తో 721(17.3ఎంయు) మెవా, 21వ తేదిన 2వ యూనిట్ సుమారు 85శాతం పిఎల్‌ఎఫ్‌తో 680(15.31ఎంయు)ల ఉత్పత్తి జరిగింది. ఆ రెండు రోజుల్లో 80శాతం పిఎల్‌ఎఫ్‌తో 123.03 ఎంయుల ఉత్పత్తి జెన్‌కోలో జరిగింది. మరలా ఆ స్థాయిలో ఉత్పత్తి జరగలేదు. ప్రస్తుతం 60శాతం పిఎల్‌ఎఫ్‌తో 93 ఎంయుల వరకే ఉత్పత్తి జరుగుతోంది. జెన్‌కో ప్లాంట్లలో ఉత్పత్తి తగ్గడంతో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చేందుకు విద్యుత్ సంస్థలు బయట మార్కెట్ నుంచి అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేస్తున్నాయి. శుక్రవారం యూనిట్ రూ.15 నుంచి 20ల వరకు బయట మార్కెట్‌లో డిస్కమ్‌లు కొనుగోలు చేశాయి.

మరమ్మతులకు గురైన యూనిట్లు

ఆర్‌టిపిపి జులై 1న 3,4 యూనిట్లలో ఉత్పత్తి నిలిచింది.

ఆరో తేదీన 3వ యూనిట్ అందుబాటులోకి వచ్చింది. మరలా వెంటనే యూనిట్-1 ఆగింది. 1,4 రెండు యూనిట్లు 9వ తేదీన అందుబాటులోకి వచ్చాయి. మరలా 18 నుంచి 20వ తేది వరకు యూనిట్ నిలిచింది. జులై 23,24వ తేదీల్లో 2,4 యూనిట్లు నిలిచాయి. 4,5 యూనిట్లలో 27 నుంచి 30వ తేది వరకు విద్యుత్ ఉత్పత్తి జరగలేదు.

ఎస్‌డిఎస్‌టిపిపి యూనిట్-2లో జులై 11,12,13 తేదీల్లో ఉత్పత్తి నిలిచింది. జులై 14 నుంచి 16వ తేదీ వరకు యూనిట్ 3 ఉత్పత్తి నిలిచింది. జులై 19 నుంచి 22వ తేది వరకు యూనిట్ 1 నిలిచింది. మరలా యూనిట్-2 జులై 30 నుంచి ఆగస్టు 4వ తేది వరకు మధ్యలో ఒక్క రోజు మాత్రమే పనిచేసింది. మరలా 5,6వ తేదీల్లో యూనిట్-3 లో ఉత్పత్తి నిలిచింది.

విటిపిఎస్ యూనిట్ -7 నెల రోజుల నుంచి అందుబాటులో లేదు. యూనిట్-1 జులై 1 నుంచి 20వ తేది వరకు నిలిచిపోయింది. 23 నుంచి 4 వ యూనిట్ నిలిచింది.

పెండింగ్ ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలి

- పోలవరం-బనకచర్లను విరమించుకోవాలి
- ఆలోచనా పరుల ఐక్యవేదిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, ప్రాజెక్టులను ప్రజల కోసం మాత్రమే నిర్మించాలని ప్రభుత్వాన్ని ఆలోచనా పరుల ఐక్యవేదిక నేతలు డిమాండ్ చేశారు. పోలవరం-బనకచర్ల, రాయలసీమ ఎత్తిపోతల పథకాలను విరమించుకోవాలన్నారు. ప్రాజెక్టులు ప్రజల కోసం నిర్మించాలి అనే నినాదంతో ఆలోచనా పరుల ఐక్యవేదిక నేతృత్వంలో ఈ నెల 4 నుంచి 6 రోజులపాటు వివిధ రంగాల నిపుణులు.. వెలుగొండ ప్రాజెక్టు, శ్రీశైలం జలాశయం పంజ్‌పూల్, ఎస్ఆర్‌బిసితో పాటు పలు ప్రాజెక్టులను సందర్శించారు. ఈ బృందంలో రిటైర్డు ఐపిఎస్ అధికారి ఎబి వెంకటేశ్వరరావు, రైతు సేవా సమితి అధ్యక్షులు అక్కినేని భవానీ ప్రసాద్, నదీ జలాలు, సాగునీటి ప్రాజెక్టుల రంగం విశ్లేషకులు టి లక్ష్మీనారాయణ, నల్లమోతు చక్రవర్తి, జొన్నలగడ్డ రామారావు, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సంస్థ అధ్యక్షులు కృష్ణమూర్తినాయుడు ఉన్నారు. బృందం పర్యటనలో గమనించిన పలు అంశాలను క్రోడీకరించి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రభుత్వానికి బృందం చేసిన పలు సూచనలు

- రూ.82 వేల కోట్లతో ప్రతిపాదిస్తున్న పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును విరమించుకోవాలి.
- రూ.3 వేలకోట్లు వృథా అయ్యే మెగా ఇంజినీరింగ్ కంపెనీ చేపట్టిన రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిలుపుదల చేయాలి. ఈ పథకంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ స్టే కూడా విధించిందని, ఇప్పటికే ఖర్చు చేసిన రూ.750 కోట్లను రుషికొండ పద్దులో కలిపేయాలి.
- వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం ఇస్తామన్న ప్యాకేజీలో భాగంగా రూ.10 వేలకోట్లు ఇఎపి ద్వారా లేక మరో విధానంలో తీసుకురావాలి. ఆ నిధులతో రాయలసీమలోని అన్ని ప్రాజెక్టుల పనులతో చివరి ఎకరా ఆయకట్టుకు కూడా నీరందించాలి.
- ఎపి పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కృష్ణా నది యాజమాన్య బోర్డుకు సాధికారత కల్పించి అనుమతుల్లేని ప్రాజెక్టులను నిలువరించాలని ప్రభుత్వానికి బృందం సూచించింది.

స్వేచ్ఛ, భద్రతకు భంగం

మొదటి పేజి తరువాయి

నమోదు రేటు బాలురు కంటే చాలా తక్కువగా ఉందని అన్నారు. ఇది డ్రాపౌట్స్, బాల్య వివాహాలు, బాలికలు ఎదుర్కొంటున్న అణచివేత వంటి సమస్యలను స్పష్టంగా ప్రతిబింబిస్తుందని అన్నారు. సియుఈటి ప్రవేశపెట్టిన తరువాత పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన కోచింగ్ మాఫియా, హాస్టల్ సౌకర్యాలు లేకపోవడం, కర్ఫ్యూలు, పాఠ్యాంశాల్లో మార్పులు ఉన్నత విద్యా సంస్థలలో బాలికల స్వేచ్ఛ, భద్రతను ప్రభావితం చేస్తున్నాయని వివరించారు.

దేశవ్యాప్తంగా క్రూరమైన అత్యాచారాలు, మహిళల హత్య ఘటనలతో పాటు, నేరస్థులకు ఆశ్రయం కల్పిస్తూ న్యాయం నిరాకరించటం తీవ్ర వైఫల్యమని అన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సమాజంలోని వివిధ వర్గాలు మనుస్మృతితో ప్రేరణ పొందిన తిరోగమన నమూనాను అనుసరిస్తున్నారని విమర్శించారు. అధికార పార్టీ ఛాందస సిద్ధాంతాలను పాటించడంతో మహిళల స్వేచ్ఛ, భద్రతకు ముప్పు వాటిల్లుతుండటం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కథువా, హత్రాస్, ఉన్నావ్, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్‌లో బాలికలపై అత్యాచారం, హత్య, దాడి జరిగిన ఘటనలు మహిళలపై వ్యవస్థాగత దాడిని సులభతరం చేయడంలో పాలకవర్గం పాత్రను బహిర్గతం చేస్తున్నాయని స్పష్టం చేశారు. అత్యాచారం, వేధింపులకు పాల్పడిన నేరస్థులను బలపరిచే ధోరణి, అధికార పార్టీతో వారి సన్నిహిత సంబంధాలు, వారి శిక్షా నిబంధనలలో సడలింపు, బహిరంగ ప్రదేశాల్లో వారికి లభించే అద్భుతమైన స్వాగతం, అటువంటి దాడులను అధికారులు ఎలా నిర్వహిస్తారనే దానిపై లోతైన అంతర్దృష్టిని అందిస్తుందని అన్నారు.

ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీ ఘటన విషయంలో బిజెపి-టిఎంసి మధ్య నిశ్శబ్ద అవగాహన స్పష్టంగా కనిపించిందని అన్నారు. ఇది సిబిఐ సరైన విచారణ చేయకుండా, నేరస్థులను చట్టం ముందు నిలబెట్టకుండా నిరోధించిందని విమర్శించారు.

విద్యార్థినుల గౌరవం, భద్రతకు ప్రతిపాదించిన కొన్ని చర్యలు

- విద్యా సంస్థల్లో జిఎస్‌క్యాస్ పునరుద్ధరణ, బలోపేతం
- అన్ని క్యాంపస్‌ల్లో తప్పనిసరి విద్యారి సంఘాల ఎన్నికలు
- సమగ్ర జెండర్ సెన్సిబులిటీ కార్యక్రమాలు
- క్యాంపస్ సమగ్ర మౌలిక సదుపాయాలు
- క్యాంపస్‌ల్లో రెగ్యులర్ భద్రతా ఆడిట్‌లు
- అత్యవసర మద్దతు వ్యవస్థలు
- పోక్సో చట్టం పునర్నిర్మాణం.

ఏజెన్సీలో ప్రైవేటుకు దారులు

మొదటి పేజి తరువాయి

కిలోమీటర్ల రహదారులు పూర్తి చేస్తామన్నారు. రూ.1,938 కోట్ల వ్యయంతో ఐటిడిఎల పరిధిలో ఐదు వేల మందికి ఏడాదికి లక్ష రూపాయలు ఆదాయం కల్పించే రీతిలో ప్రత్యేక ఉపాధి కల్పన కార్యక్రమం చేపడతామని తెలిపారు. విజయనగరం జిల్లాలో 519 ఎకరాల్లో ట్రైబల్ యూనివర్సిటీ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. అరకు, లంబసింగి, మారేడుమిల్లి ప్రాంతాలను టూరిజం క్లస్టర్లుగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. రాబోయే రోజుల్లో స్థానికంగా వెయ్యి వరకూ హోమ్ స్టేలు ఏర్పాటు చేసుకునేలా ఆర్థిక సాయం చేస్తామన్నారు. వంజంగిలో వనదేవత మోదకొండమ్మ ఆలయాన్ని చంద్రబాబు దర్శించారు. గ్రామ సమీపంలో కాఫీ తోటలను పరిశీలించి, గిరిజన సంప్రదాయ పండగలను, వేడుకలను తిలకించారు. ఆదివాసీ ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నిరుత్సాహపరిచిన ముఖ్యమంత్రి పర్యటన

చంద్రబాబు పర్యటన ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర నిరాశ మిగిల్చింది. ఆదివాసీ సమాజం కొండంత ఆశతో ఎదురుచూస్తున్న వంద శాతం ఉద్యోగ రిజర్వేషన్, ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సిపై చంద్రబాబు మాటలకే పరిమితమయ్యారు. దీంతో, గిరిజన అభ్యర్థులకు తీవ్రమైన నష్టం జరగనుందని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స తెలిపారు.



గుర్రాలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

రహదారి కోసం గుర్రాలతో నిరసన యాత్ర

ప్రజాశక్తి - మాడుగుల (అనకాపల్లి)

తమకు రోడ్డు సౌకర్యం కల్పించాలని అనకాపల్లి జిల్లా మాడుగుల మండలానికి చెందిన పివిజిటి గిరిజనులు ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శనివారం వినూత్నంగా గుర్రాలతో నిరసన యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాడుగుల మండలంలోని ఆవురువాడ పంచాయతీ పశువులు బంద గ్రామం, రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ జీలుగులోవ, సోంపురం బంద గ్రామాల గిరిజన కుటుంబాలు సామలమ్మ కొండపై జీవిస్తున్నాయని తెలిపారు. నేటికీ రోడ్డు సౌకర్యం లేక తీవ్ర అవస్థలు పడుతున్నట్టు చెప్పారు. కొండమీద జీవనం సాగిస్తున్న తమను కొండ దిగువన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని కోరగా అలాగే చేశామని, నేటికీ వాటికి పట్టాలు ఇవ్వలేదని కొందరు గిరిజనులు తెలిపారు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో నేటికీ డోలీ మోతలే శరణ్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని ఆదివాసీ గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా అధ్యక్షులు కె.గోవిందరావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఇ.నరసింహమూర్తి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ప్రమాదంలో ఆదివాసీల ఉనికి

మొదటి పేజి తరువాయి

చెప్పారు. వారి హక్కులను కాపాడే బాధ్యత గిరిజనేతరులపై కూడా ఉందన్నారు. 'మన భూమి, మన సంస్కృతి, మన అడవి, మన భాష' నినాదాలతో రాబోయే రోజుల్లో పోరాటాలు చేయాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన సురేంద్ర మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అడవి సంపదను కార్పొరేట్,ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఒకవైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌కు అప్పగిస్తున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మరోవైపు అడవులను కూడా కట్టబెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజలను కులాలు, మతాల భ్రమల్లో ఉంచి పెత్తనం చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ గిరిజన తండాలు, దళితుల కాలనీల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని పరిష్కారం కావడం లేదన్నారు. ఎస్సి,ఎస్టి సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎఐఎస్‌టిఇఎ నాయకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ గిరిజనులకు వసతులు కల్పించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం వహిస్తోందని, హాస్టళ్లల్లో ఇప్పటికీ సరైన వసతులు లేవన్నారు. గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు ఎ అశోక్ మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభించి రెండు నెలలు గడుస్తున్నా గిరిజన ప్రాంతంలోని 72 పాఠశాలల్లో ఇప్పటికీ టీచర్లు లేరని అన్నారు. మైదాన ప్రాంతాల్లో ఉన్న గిరిజనులకు ఉపాధి చూపించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ బాలాజీ నాయక్, యానాది సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బాపట్ల శివకృష్ణ, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి బలియా నాయక్, ప్రొఫెసర్ భూక్యా శ్రీనివాస్ మాట్లాడుతూ చదువు ద్వారానే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బానావత్ శ్రీనివాసరావు వందన సమర్పణ చేసిన ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు,ఆలిండియా బంజార సేవ సంఘం రాష్ట్ర నాయకులు హుస్సేన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు రక్తసిక్తం

మొదటి పేజి తరువాయి

ఢీకొట్టింది. దీంతో, వీరిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సుబ్రమణ్యం గల్ఫ్ దేశంలో పదేళ్లు ఉండి తండ్రి మృతి చెందడంతో ఇటీవలే స్వగ్రామానికి వచ్చారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. దుర్గాప్రసాద్ అవివాహితుడు.

తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామానికి చెందిన గుండెపల్లి మణిశంకరం (30) తన చెల్లెలితో రాఖీ కట్టించుకోవడానికి దేవరపల్లి మండలం యాదవోలు గ్రామానికి బైకుపై వెళ్తున్నారు. గోపాలపురం మండలం వెంకటాయపాలెం వద్ద ఆయన బైక్, ఎదురుగా వస్తున్న గోపాలపురం మండలం వాదాలకుంట గ్రామానికి చెందిన సువర్ణ రాజు (50) బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మణిశంకరం అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన సువర్ణ రాజు... రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో మరణించారు. కాగా, ఆకుకూరలు అమ్ముతూ తనను పోషిస్తున్న కుమారుడు మణిశంకరం మరణ వార్త విన్న ఆయన తండ్రి, డయాలసిస్ పేషంట్ శ్రీను (59) గుండె ఆగి మరణించాడు. ఒకే రోజు తండ్రీకొడుకుల మృతితో పెద్దేవం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.



కాఫీ తోటలో కూర్చుని గిరిజనులు ఇచ్చిన కాఫీని సేవిస్తున్న చంద్రబాబు



గిరిజన కుటుంబంతో ముచ్చటిస్తున్న చంద్రబాబు

సిఎం పర్యటనలో కుదిరిన ఒప్పందాలు ఇవే...

ప్రజాశక్తి- పాడేరు (అల్లూరి జిల్లా)

రంపచోడవరం ఐటిడిఎ ప్రాంతంలో రబ్బరు సాగును ప్రోత్సహించేందుకు వివిధ మౌలిక సదుపాయాల కల్పన, సాగు విస్తరణ కోసం కేంద్రీయ రబ్బర్ బోర్డు ఐటిడిఎతో సిఎం సమక్షంలో ఒప్పందం కుదుర్చుకుంది. గిరిజన ఉత్పత్తుల విక్రయాలు, అరకు కాఫీకి ప్రోత్సాహం కల్పించేందుకు జిసిసితో ఒప్పందం కుదిరింది. స్థానికంగా డ్వాక్రా మహిళలు రూపొందించిన ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేందుకు ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్టు ప్రభుత్వం చెప్పింది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో అరకు కాఫీ కియోస్క్‌ను మెప్మా ద్వారా ఏర్పాటు చేసేందుకు మరో ఒప్పందం కుదిరింది. గిరిజన సహకార కార్పొరేషన్ ఉత్పత్తులను అమెరికా లాంటి దేశాల్లో విక్రయించేందుకుగానూ హాతీ సర్వీసెస్ ఎల్ఎల్‌సి కంపెనీతో జిసిసి ఒప్పందం చేసుకుంది. యుఎస్‌ఎలోనూ జిసిసి సంస్థ తన రిటైల్ ఆపరేషన్స్ చేపట్టేలా ఈ ఒప్పందం తోడ్పడనున్నట్టు ప్రభుత్వం చెప్పింది. గిరిజన ఉత్పత్తులను దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో విక్రయించేందుకు ట్రైఫెడ్-ఎపి జిసిసిలు సంయుక్తంగా రిటైల్ షోరూములను ఏర్పాటు చేసేందుకు ఆ రెండు సంస్థల మధ్య ఒప్పందం కుదిరింది. షోరూముల వద్ద అరకు కాఫీ కియోస్క్‌లను ఏర్పాటు చేయాలని ఒప్పందంలో అవగాహనకు వచ్చారు. ప్రముఖ కార్పొరేట్ దిగ్గజం టాటా కన్స్యూమర్స్ సంస్థ కూడా ఆర్గానిక్ అరకు కాఫీని బ్రాండ్ చేసేందుకు, మార్కెట్ చేసేందుకు జిసిసితో ఒప్పందం చేసుకుంది. చింతపల్లిలో రెడ్ చెర్రీ పండ్ల రిఫైనింగ్, ప్రాసెసింగ్ యూనిట్ సహా మౌలిక సదుపాయాల కల్పనకు సబ్ కో సంస్థ ఎంఒయు కుదుర్చుకుంది. ప్రస్తుతం ఉన్న ప్రాంతంతోపాటు అదనంగా నాలుగు వేల ఎకరాల్లో కాఫీ ప్లాంటేషన్ విస్తరించేందుకు ఐటిసి సంస్థ ఐటిడిఎ పాడేరుతో ఒప్పందం చేసుకుంది. ఇప్పటికే 10,025 ఎకరాల్లో రైతుల సహకార సంస్థతో కలిసి ఐటిసి కాఫీని సాగు చేస్తోంది. కాఫీ బోర్డు కూడా గిరిజన ప్రాంతాల్లో కాఫీ సాగు విస్తరణ, నాణ్యమైన కాఫీ పంట ఉత్పత్తి, సాగులో సుస్థిర విధానాల అమలుకు ఒప్పందం చేసుకుంది. గిరిజన మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు గ్రామీణ ప్రాంతాల్లో మార్కెటింగ్ కల్పించే అంశంపై ఫ్రాంటియర్ మార్కెటింగ్, ఈజీ మార్ట్ సంస్థలు ప్రభుత్వంతో ఒప్పందాన్ని చేసుకున్నాయి. పసుపు ఉత్పత్తి, వివిధ టెర్మరిక్ ఉత్పత్తులకు మార్కెటింగ్‌ను అనుసంధానించడం, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఐటిడిఎతో ఎక్విప్ సంస్థ ఎంఒయు కుదుర్చుకుంది. సీజన్ల వారీగా ఉత్పత్తయ్యే అటవీ ఉత్పత్తులను గిరిజన మహిళా సంఘాల ద్వారా విక్రయించేందుకు వీలుగా అవగాహన కల్పించేందుకు ఐఎస్‌బి సంస్థ మరో కీలకమైన ఒప్పందం చేసుకుంది. పర్యాటక రంగంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా గిరిజన ప్రాంతాల్లో హోమ్ స్టేలను ఏర్పాటు చేసేందుకు ఓయో హోమ్స్, హోమీ హట్స్ సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. గిరిజన విద్యార్థుల్లో నైతిక విలువల పెంపు కోసం మార్పు సొసైటీ ఎంఒయు చేసుకుంది. ప్రకృతి సేద్యం, మార్కెటింగ్ సదుపాయాలు, జీవనోపాధి తదితర అంశాల్లోనూ అవగాహనా ఒప్పందాలు కుదిరాయి. గిరిజన పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు ఎపి టూరిజం ఫోరం ముందుకు వచ్చింది.



సంస్థలకు ఒప్పంద పత్రాలు అందజేస్తున్న సిఎం చంద్రబాబు

13, 14 తేదీల్లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

- విద్యార్థి సంఘాల పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాల విద్యాశాఖ, జూనియర్ కళాశాలల ఆవరణలోకి విద్యార్థి సంఘాల అనుమతిని నిరాకరిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13, 14 తేదీల్లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం కార్యక్రమానికి విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి నాసర్ అధ్యక్షతన విజయవాడలోని దాసరి భవన్‌లో విద్యార్థి సంఘాల ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కె ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల హక్కులను కాలరాసేలా ఉత్తర్వులు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలను, విద్యార్థి సంఘాలకు వ్యత్యాసం ఉందని, రెండింటినీ ఒకే గాటిన కట్టడం మంచిది కాదని పేర్కొన్నారు. విద్యార్థుల హక్కుల కోసం విద్యార్థి సంఘాలు నినదిస్తాయని తెలిపారు. పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ.. ఎన్ఇపిలో భాగంగా విద్యా వ్యాపారాన్ని ప్రోత్సహించేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఉన్నాయని విమర్శించారు. పిడిఎస్ఒ నాయకులు భాను మాట్లాడుతూ.. విద్యార్థి సంఘాల గొంతు నులిమే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు. పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో మంత్రి లోకేష్ విద్యార్థి సంఘాలను పిలిచి సమస్యలపై గట్టిగా పోరాటం చేయాలని ప్రోత్సాహించారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటువంటి నిబంధనలు విధించడం మాట మార్చడమేనని విమర్శించారు. ఈ సమావేశంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, ఎఐడిఎస్ఒ నాయకులు త్రినాథ్, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు రఫీ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి శశి, ఎఐవైఎఫ్ నాయకులు లంకా గోవిందరాజులు తదితరులు పాల్గొని మాట్లాడారు.



కానిస్టేబుల్‌కు రాఖీ కడుతున్న హోం మంత్రి అనిత

పోలీసులు, ఖైదీలకు రాఖీ కట్టిన హోం మంత్రి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

రాఖీ పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత విశాఖలో శనివారం రాఖీ వేడుకలు జరుపుకున్నారు. ఆమె మొదటిగా విశాఖ ఎంవిపి.కాలనీలోని ఆటో డ్రైవర్ గిరీశ్‌కు, శాంతిభద్రతల సిఐ మురళీకి, ట్రాఫిక్ సిఐ ప్రసాద్‌కు, పోలీసు సిబ్బందికి రాఖీ కట్టి సంతోషాన్ని పంచుకున్నారు. ఆటోడ్రైవర్ గిరీశ్ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఎంవిపి పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కొర్లయ్య అనారోగ్యంతో బాధపడుతున్నారన్న విషయం తెలుసుకుని ఆటోలో ఎంవిపి.కాలనీ నుంచి ఉషోదయ జంక్షన్ వద్దగల ఆదర్శనగర్‌లో నివాసముంటున్న ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయనకు రాఖీ కట్టి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఆమె తన కార్యాలయంలో విధుల్లో ఉన్న ఇతర పోలీసు సిబ్బందికి రాఖీలు కట్టారు. తదుపరి ఆరిలోవ సమీపంలోని కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. జైల్లోని 30 మంది ఖైదీలకు రాఖీలు కట్టారు. గంజాయి రవాణాలో నిందితులుగా ఉన్న ఖైదీలకు సమాజంపై అవగాహన కల్పించారు. సులభంగా డబ్బులు సంపాదించడం కోసం తీసుకునే నిర్ణయాలు జీవితాన్ని నాశనం చేస్తాయని హెచ్చరించారు. బతకడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని, ఖైదీల జీవితాల్లో మార్పు రావాలని అన్నారు. వచ్చే సంవత్సరం రాఖీ పండగను కుటుంబ సభ్యులతో జరుపుకునే స్థితికి ఖైదీలు చేరాలని ఆశాభావం వ్యక్తం చేశారు. జైళ్లశాఖ అధికారులకూ ఆమె రాఖీలు కట్టారు.



పోలీసులకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు

సాయుధ దళ పోలీసులకు విద్యార్థినుల తిరంగా రాఖీలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఎపి స్పెషల్ పోలీస్ రెండవ బెటాలియన్ సాయుధ దళ పోలీసులకు కర్నూలు జిల్లా కృష్ణానగర్ బిసి సంక్షేమ వసతి గృహ విద్యార్థినులు తిరంగా రాఖీలు కట్టారు. సెట్కూరు సిఇఒ డాక్టర్ కె.వేణుగోపాల్ మాట్లాడుతూ.. దేశ శాంతి భద్రతకు, సమగ్రతకు అహర్నిశలు పాటుపడుచున్న సైనికులు, సాయుధ దళ పోలీసుల సేవలు వెళ్లకట్టలేనివన్నారు. వారి సేవలను అభినందించే ఉద్దేశంతో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులతో తిరంగా రాఖీలు కట్టించామని తెలిపారు. ఎపిఎస్‌పి అసిస్టెంట్ కమాండెంట్ డిఎస్‌పి మహబూబ్ బాషా మాట్లాడుతూ.. విద్యార్థుల తమ వద్దకు వచ్చి రాఖీలు కట్టి వారి దేశ భక్తిని చాటుకోవడం ఆనందదాయకమన్నారు. దేశ సేవలో పాలుపంచుకుంటున్న పోలీసులకు రాఖీలు కట్టించే అవకాశం కల్పించిన అధికారులకు విద్యార్థినులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మండల విద్యాశాఖధికారి శ్రీనివాసులు, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రమేష్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

- ఇసి ఎదుట వైసిపి ధర్నా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పులివెందులలో వైసిపి ఎమ్మెల్సీ రమేష్‌పై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని, అక్రమ అరెస్టులను అడ్డుకోవాలని వైసిపి నేతలు విజయవాడ బందరు రోడ్డులోని ఎన్నికల కమిషన్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పులివెందులలో ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో జరిగేందుకు ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ ఆగడాలకు ఇసి అడ్డుకట్ట వేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా వైసిపి నేతలు మీడియాతో మాట్లాడుతూ.. టిడిపి నేతలు ఒకవైపు దౌర్జన్యాలకు పాల్పడుతూ.. మరొక వైపు ఓటర్లను ప్రలోభపెడుతున్నారని విమర్శించారు. పులివెందుల జడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో ఎలాగైనా గెలుపొందాలని టిడిపి కూటమి అడ్డదారులు తొక్కుతోందన్నారు. అధికార పార్టీ అరాచకాలకు పోలీసులు వంత పాడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ కళ్లు మూసుకుంటే ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని, పులివెందులలో ఓటర్లకు దూరంగా పోలింగ్ బూత్‌లు తీసుకెళ్తున్నారన్నారు. కలెక్టరు, పోలీసులు, స్థానిక ఎన్నికల కమిషన్ అధికారులంతా కలిసి పులివెందులలో ప్రజాస్వామ్యాన్ని చంపేస్తున్నారని మాజీ మంత్రి పేర్నినాని ఆరోపించారు. ధర్నా అనంతరం ఎన్నికల కమిషన్ కార్యాలయంలో కమిషనరు నీలం సహాని అందుబాటులో లేకపోవడంతో సెక్రటరీ జివి సాయి ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పేర్ని నానితోపాటు ఫైబర్‌నెట్ మాజీ ఛైర్మన్ గౌతంరెడ్డి, ఎన్‌టిఆర్ జిల్లా వైసిపి అధ్యక్షులు దేవినేని అవినాష్, పలువురు వైసిపి నేతలు పాల్గొన్నారు.

దేశ భక్తిని రగిల్చిన క్విట్ ఇండియా ఉద్యమం

- పిసిసి ఉపాధ్యక్షులు మస్తాన్ వలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్వాతంత్ర్య పోరాటంలో క్విట్ ఇండియా ఉద్యమం దేశ భక్తిని రగిల్చిందని పిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్ వలి పేర్కొన్నారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో శనివారం క్విట్ ఇండియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బిజెపి ప్రభుత్వం ఆత్మనిర్భర్ భారత్ పేరుతో ప్రజల హక్కులను కుదించి, రాజ్యాంగ విలువలను దెబ్బతీస్తోందని ఆరోపించారు. డూప్లికెట్ ఓటర్లు, నకిలీ చిరునామాలు, చెల్లని ఫొటోలు, ఒకే చిరునామాలో బల్క్ ఓటర్ల నమోదు, ఫారం-6 దుర్వినియోగం ద్వారా వయసు ఎక్కువ ఉన్నవారిని కొత్త ఓటర్లుగా నమోదు చేయడం ద్వారా ఎన్నికల్లో బిజెపి లాభపడిందన్నారు.

భూమన అనుచరుల దాడి అమానుషం

- టిడిపి ఎమ్మెల్యే రామాంజనేయులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తిరుపతిలో భూమన కరుణాకర్ రెడ్డి, ఆయన అనుచరులు దినేష్ రెడ్డి, అనిల్ రెడ్డి కలిసి పవన్ అనే దళిత యువకుడిపై అమానుషంగా, విచక్షణారహితంగా దాడి చేశారని టిడిపి ఎమ్మెల్యే బి రామాంజనేయులు పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జరిగిన దాడిని వీడియో తీసి పవన్ తండ్రికి పంపించి పైశాచిక ఆనందం పొందడం అమానవీయమని పేర్కొన్నారు. దళితుల పట్ల వారి ధోరణి మారలేదన్నారు. వైసిపి పాలనలో దళితులపై జరిగిన దాడులు, అణచివేత వారి హక్కులను కాలరాశాయని విమర్శించారు. దళితుల కోసం ఉద్దేశించిన 27 పథకాలను రద్దు చేసి, సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారన్నారు. పవన్‌పై దాడిచేసిన భూమన కరుణాకర్ రెడ్డి, ఆయన అనుచరులను వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి, కఠినంగా శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వృద్ధురాలు దారుణ హత్య

ప్రజాశక్తి - చీడికాడ (అనకాపల్లి)

మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి గంజాయి మత్తులో వృద్ధురాలిని హత్య చేసిన సంఘటన అనకాపల్లి జిల్లా చీడికాడ మండలంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల మేరకు చీడికాడ మండలంలోని ఎల్‌బి పట్నం గ్రామానికి చెందిన పవన్ సాయి (25) చెడు వ్యసనాలకు బానిసై మతిస్థిమితం కోల్పోయాడు. విశాఖపట్నంలోని మానసిక చికిత్సాలయంలో కొన్నాళ్లు చికిత్స సైతం పొందాడు. ఆయన కుటుంబీకులంతా విశాఖ నగరంలోని కంచరపాలెంలో నివాసం ఉంటున్నారు. పవన్ సాయి రెండు రోజుల క్రితం స్వగ్రామమైన ఎల్‌బి పట్నానికి వచ్చారు. మతిస్థిమితం లేకపోవడంతోపాటు గంజాయి, మద్యం అధికంగా సేవించడం వల్ల పిచ్చిపిచ్చిగా ప్రవర్తించారు. అదే గ్రామానికి చెందిన గండి పైడితల్లమ్మ (70) శనివారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళుతుండగా పవన్ సాయి ఆమెను కాలువలోకి తోసేశాడు. వెంటనే పక్కనే ఉన్న బండరాయి తీసుకొని ఆమె తలపై కొట్టి చంపేశాడు. మృతురాలి కుమారుడు గండి పూర్ణ శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పరారీలో ఉన్నాడు.

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ

విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మను వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు శనివారం వేర్వేరుగా దర్శించుకున్నారు. ఉత్తరప్రదేశ్ కార్మిక ఉపాధి శాఖ మంత్రి మనోహర్లాల్ మన్ను కోరి, ప్రముఖ జ్యోతిష్యులు కృష్ణమాచార్యులు, బిజెపి నాయకులు పాతూరి నాగభూషణం దుర్గమ్మ దర్శనార్థం ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. వీరికి ఆలయ ఇఒ సాదర స్వాగతం పలికారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి లలిత దంపతులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, ఆలయ ఇఒ శీనా నాయక్ స్వాగతం పలికి, అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించారు. ఇదే క్రమంలో రాష్ట్ర ఇంటిలిజెన్స్ డైరెక్టర్ జనరల్ మహేష్ చంద్ర లడ్డా కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు.

పి4 ద్వారా పాఠశాలల అభివృద్ధి

- మంత్రి నారాయణ

ప్రజాశక్తి -నెల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. నగరంలోని నాలుగు పాఠశాలల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మరో 11 పాఠశాలలను పి4 ద్వారా అభివృద్ధి చేస్తామన్నారు. మూలపేట బాలికల ఉన్నత, విఆర్‌సి, ఆర్ఎస్ఆర్ పాఠశాలలను శనివారం మంత్రి పరిశీలించారు. అనంతరం విఆర్‌సి పాఠశాలలో కార్పొరేషన్, విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. పాఠశాలల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. మూలపేట బాలికోన్నత పాఠశాల, ఆర్ఎస్ఆర్ స్కూల్స్‌ను డిఎస్ఆర్ బ్రదర్స్, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అధునీకరిస్తున్నారన్నారు. మరిన్ని పాఠశాలలను అభివృద్ధి పరిచేందుకు మరి కొంతమంది ముందుకు వస్తున్నారని తెలిపారు. కార్పొరేట్ తరహా విద్యను పేద విద్యార్థులకు ఉచితంగా అందించేందుకు నగర పరిధిలోని 11 హైస్కూల్స్ వచ్చే విద్యాసంవత్సరానికి సిద్ధం చేస్తున్నామన్నారు.

అణు యుద్ధం.. భవిష్యత్తుకు ముప్పు

- ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అణు యుద్ధం మానవ జాతి భవిష్యత్తుకు ముప్పు అని, అలాంటి దారుణం మళ్లీ జరగకూడదని ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె రాజశేఖర్ పేర్కొన్నారు. ప్రపంచ శాంతికి అణునిరాయుధీకరణ అవసరమన్నారు. హిరోషిమా, నాగసాకి ఘటనలను స్మరించుకునేందుకు భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్), అఖిల భారత శాంతి సంఘీభావ సమితి (అయిప్సో) కార్యక్రమాన్ని శనివారం విజయవాడ శాతవాహన కళాశాల ఆవరణలో కృష్ణా జిల్లా ఇస్కఫ్ అధ్యక్షులు పరుచూరి అజయ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సభలో అణు యుద్ధానికి వ్యతిరేకంగా 'స్వరం వినిపిద్దాం-శాంతి కోసం ఏకమవుదాం', 'దేశంపై అమెరికా విధించిన సుంకాలను రద్దు చేయాలి' అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి అధ్యక్షులు పి చంద్రనాయక్, ఎఐవైఎఫ్ నాయకులు లంకా గోవిందరాజులు, దోనేపూడి సూరిబాబు, సైనుద్దీన్, సుజాన్ముల్క్ సురేష్, మహబూబ్ అజాం పాల్గొన్నారు.

మద్యం ఆదాయం ఫుల్ జోష్

- ఖజానాకు రూ.వేల కోట్ల రాబడి
- డీజిల్ వాహనాల సంఖ్య పెరిగినా.. తగ్గిన ఇం'ధనం'



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో మద్యం ఏరులైపారుతోంది. ఆదాయవనరుల్లో అత్యధికంగా మద్యం అమ్మకాల ద్వారానే ఉండటమే ఇందుకు నిదర్శనం. ఇక కీలకమైన మద్యంపై తొలి నాలుగు నెలల కాలంలో 19.27 శాతం వృద్ధి కనిపించినట్లు అధికారులు చెబుతున్నారు. గత ఏడాది రూ.277 కోట్లు వ్యాట్ ద్వారా రాగా, ఈ ఏడాది రూ.331 కోట్లు సమకూరింది. వాస్తవానికి అధికారులు చెబుతున్న లెక్కల మేరకే ప్రతి రోజూ వంద కోట్ల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. అంటే నెలకు రూ.మూడు వేల కోట్లు, నాలుగు నెలలకు రూ.12 వేల కోట్ల మేర మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. ఇంత భారీగా అమ్మకాలు జరుగుతున్నప్పటికీ వ్యాట్ మాత్రం కేవలం రూ.300 కోట్ల వరకే రావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. మొత్తం అన్ని రకాల వ్యాట్‌లతో కలిపి జిఎస్‌టి రూ.17,854 కోట్లు రాగా, ఇది కేవలం 4.16 శాతం వృద్ధి మాత్రమే నమోదు చేయడం గమనార్హం.

అత్యంత కీలక ఆదాయ వనరు అయిన ఇంధనంపై వచ్చే ఆదాయంలో లోటు కనిపిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో వచ్చిన పన్ను ఆదాయం కన్నా ఈ ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో వ్యాట్ ఆదాయం తగ్గినట్లు కనిపిస్తోంది. ఒక్క జూలై నెల ఆదాయం పెరిగినప్పటికీ, నాలుగు నెలల ఆదాయంలో తగ్గుదల కనిపించడం విశేషం. ఈ తగ్గుదల 0.81 శాతంగా ఉన్నట్లు గుర్తించారు. గతేడాది జూలై వరకు రూ.5,523 కోట్లు వ్యాట్ ద్వారా సమకూరగా, ఈ ఏడాది జూలై వరకు రూ.5,478 కోట్లు వచ్చింది. విద్యుత్ వాహనాల వినియోగం పెరగడం కారణంగా పెట్రోల్ వాడకం తగ్గడం దీనికి ఒక కారణంగా భావిస్తున్నారు. అయితే డీజిల్ ఎక్కువగా వినియోగించే భారీ వాహనాల సంఖ్య మాత్రం పెరుగుతూనే ఉంది. ఆ మేరకు డీజిల్ అమ్మకాలు పెరగాల్సివుంది కానీ..ఇంధన ఆదాయం తగ్గుదలకు నిర్దిష్ట కారణాలేమిటనేదానిపై మరింత విశ్లేషణ చేయాల్సివుందని అధికారులు అంటున్నారు.

'పాత పెన్షన్' కోరుతూ 25న మహాధర్నా

- డిఎస్‌సి-2003 టీచర్స్ ఫోరం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న రాష్ట్రస్థాయి మహాధర్నా నిర్వహించనున్నట్లు డిఎస్‌సి-2003 టీచర్స్ ఫోరం వెల్లడించింది. ఆ ఫోరం రాష్ట్రస్థాయి సమావేశం విజయవాడ ఎన్‌జిఒ హోమ్‌లో శనివారం జరిగింది. సమావేశ నిర్ణయాలను ఒక ప్రకటన ద్వారా ఫోరం తెలిపింది. డిఎస్‌సి-2003 నోటిఫికేషన్ విడుదల చేసిన సమయంలో పాత పెన్షన్ విధానమే అమల్లో ఉందని ఫోరం నాయకులు తెలిపారు. నియామక ప్రక్రియ ఆలస్యం కావడంతో తమను బలవంతంగా నూతన పెన్షన్ విధానంలోకి 2005లో మార్చారని, దీనివల్ల తమకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధాన పరమైన లోపాల వల్ల నష్టపోయిన తమను కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం పాత పెన్షన్‌లోకి మార్చాలని డిమాండ్ చేశారు. ఆర్థిక శాఖ వద్ద పూర్తి వివరాలు ఉన్నప్పటికీ, నిర్ణయం తీసుకోవడంలో జాప్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ సమస్య కేవలం తమకే కాదని, పోలీస్, ఇతర శాఖలకు చెందిన మొత్తం 11 వేలమంది ఉద్యోగుల జీవితాలకు సంబంధించిందని పేర్కొన్నారు. ఇటీవల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. తమ హక్కులను సాధించుకోవడానికి, జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి బలంగా తీసుకెళ్లడానికి ఈ నెల 25న విజయవాడలో మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి జెఎసి ఛైర్మన్ ఎ విద్యాసాగర్, ఫోరం కన్వీనర్లు ఎం శివశంకర్‌రావు, కె లక్ష్మీ శ్రీనాథ్, టి నాగరాజు, ఎంవి సుబ్బారెడ్డి, పి సతీష్, కె మధు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అకాడమీ నెలకొల్పాలి

- కార్యాలయాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి
- రాష్ట్ర ఎపిఆర్ఎస్ఎ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-పార్వతీపురం

రాష్ట్రంలో పోలీసు అకాడమీ మాదిరిగా రెవెన్యూ అకాడమీ నెలకొల్పాలని రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. గత పదేళ్లుగా రాష్ట్రంలోని రెవెన్యూ కార్యాలయాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవని, ప్రభుత్వాలకు ఫిర్యాదు చేసినా కనీస స్పందన ఉండడంలేదని తెలిపారు. పార్వతీపురంలోని తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో రెవెన్యూ హోం నిర్మాణానికి ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 108 తహశీల్దార్, 26 ఆర్‌డిఒ కార్యాలయాల నిర్మాణానికి ఏడేళ్ల క్రితం నిధులు కేటాయించినా అవి పునాదుల దశలోనే ఉన్నాయన్నారు. ఏ ప్రభుత్వానికైనా రెవెన్యూ, పోలీసు శాఖలు రెండు కళ్లు లాంటివని, పుట్టిన నాటి నుంచి మరణించే వరకూ రెవెన్యూ శాఖతో ప్రజలకు పనులు ఉంటాయని తెలిపారు. రెవెన్యూ ఉద్యోగులకు కనీస సౌకర్యాలు కల్పిస్తే పారదర్శకమైన, మెరుగైన సేవలు అందిస్తామని చెప్పారు. శిథిలావస్థలో ఉన్న రెవెన్యూ భవనాల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కొన్ని రెవెన్యూ కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులకు కనీసం మరుగుదొడ్ల సదుపాయం లేదన్నారు. తహశీల్దార్ వాహనాలకు ఇచ్చే నిధులు రూ.12 వేలకు కుదించారని తెలిపారు. కొత్తగా ఉద్యోగాల్లో చేరిన వారికి కనీస శిక్షణ ఉండడంలేదన్నారు. అసెంబ్లీ జరుగుతున్న ప్రతిసారి చట్టాలు మారుతున్నాయని, దీని వల్ల ఉద్యోగులకు వాటిపై అవగాహన ఎలా వస్తుందని ప్రశ్నించారు. ప్రభుత్వం జారీ చేసిన జిఒలు వివరంగా ఉండడం లేదని తెలిపారు. సముద్ర తీరప్రాంతంలో ఉన్న రెవెన్యూ కార్యాలయాలైనా పక్కాగా నిర్మించాలని డిమాండ్ చేశారు.



గంజాయి, నిందితులను మీడియాకు చూపుతున్న ఎస్‌పి వకుల్ జిందల్

వంద కేజీల గంజాయి పట్టివేత

- నలుగురు అరెస్టు
- ముగ్గురు పరారీ

ప్రజాశక్తి- విజయనగరం కంటోన్మెంట్

ఒడిశా నుంచి తమిళనాడుకు తరలిస్తున్న వంద కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేశారు. శనివారం విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్‌పి వకుల్ జిందల్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... పోలీసులకు వచ్చిన సమాచారంతో విజయనగరం జిల్లా బొండపల్లి మండలం గొట్లాం బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఒడిశా నుంచి తమిళనాడుకు వెళ్తున్న ఓ కారును తనిఖీ చేశారు. కారులో గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితుల్లో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన నిందితుడు ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా పొట్టంగి తాలూకా పుకలి గ్రామానికి చెందిన మనోరంజన్ మిశ్రా ఇచ్చిన సమాచారంతో మరో ముగ్గురు నిందితులు అనకాపల్లి జిల్లా పరవాడ మండలం దలాయిపాలెం గ్రామానికి చెందిన దలాయి రామరాజు, విశాఖపట్నం సిటీ భీమిలి మండలం తగరపువలస నిమ్మవానిపేట కాలనీకి చెందిన విరుమండి గోపి, తమిళనాడు రాష్ట్రం దిండిగల్ జిల్లా నర్థాం గ్రామానికి చెందిన పాండియం మాణిక్యంను అదుపులోకి తీసుకున్నారు. దలాయి రామరాజు, విరుమండి గోపి స్నేహితులు. వీరికి ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లాకు చెందిన సుదర్శన్ ఖోరాతో పరిచయం ఏర్పడింది. ఆయన సహాయంతో గంజాయిని కొనుగోలు చేసి తమిళనాడుకు చెందిన పాండియన్ మాణిక్యంతో కలిసి లారీల్లో తరలించేవారు. పరారైన పియూష్ పడాలు, ఒడిశాలో గంజాయిని కొనుగోలు చేసి, సరఫరా చేసే ప్రధాన నిందితుడు సుదర్శన్‌ఖోరాను త్వరలో పట్టుకుంటామని ఎస్‌పి తెలిపారు. నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి వంద కేజీల గంజాయితో పాటు నాలుగు సెల్‌ఫోన్లు, రూ.2,500 నగదు, కారును స్వాధీనం చేసుకున్నామని ఎస్‌పి తెలిపారు.

సంపాదకీయం

జీవం పోసుకున్న ఏ ప్రాణికైనా తొట్ట తొలి పరిచయం అయ్యేది ఆకలి! ఈ క్షణంలోంచి మరో క్షణంలోకి ప్రవహించే ప్రతి క్షణం శక్తిని వినియోగించే ప్రయాణిస్తుంది. ఆవు కడుపులోంచి అప్పుడే బయటికొచ్చిన లేగదూడ శ్వాసించిన మరుసటి క్షణంలోనే పాలధారలు నిండిన పొదుగు వైపు మోర చాస్తుంది. ఆకలి అవసరమై, అత్యవసరమై దానికి దారి చూపిస్తుంది. అందుచేత అమ్మ కన్నా ముందే ఆకలే బతుకు దారిని చూపే ఆదిమ గురువు అని మనం నిర్ద్వంద్వంగా తీర్మానించవొచ్చు. ఆకలికి అన్వేషణకీ, ఆకలికి ఆవిష్కరణకీ, ఆకలికి ఆచరణకీ ఆదినుంచీ అవినాభావ సంబంధం ఉంది. ఆకలి ప్రకృతి సహజమే కాదు; ప్రప్రథమ ఆరోగ్య లక్షణం కూడా. ఆకలితో అల్లాడని ప్రజలు ఉన్న దేశాన్ని సంపన్నదేశం అనొచ్చోలేదో కానీ, సంతోష దేశం అని మాత్రం కచ్చితంగా పేర్కొనవొచ్చు.

ప్రపంచంలో ఆకలితో నకనకలాడే అన్నార్తులు ఉండకూడదన్న భావనతోనే మానవతా సూత్రాలు ఉద్భవించాయి. సాటి జనం క్షుద్బాధను చల్లార్చే మానవీయ దృక్పథంలోంచే అనేకమంది మహానుభావులు పుట్టుకొచ్చారు. "భరత ఖండంబు చక్కని పాడియావు/ హిందువులు లేగదూడలై యేడ్చుచుండ/ తెల్లవారను గడుసరి గొల్లవారు/ పితుకుచున్నారు మూతులు బిగియగట్టి" అని భారతీయుల ఆకలి గురించి, బ్రిటీషు పాలకుల దోపిడీ గురించి బాధపడ్డారు తెలుగు కవి చిలకమర్తి. ఇలా ఒకరి ఆకలికి, ఆవేదనకీ మరొకరు కారణమైనప్పుడు తిరుగుబాట్లు పుట్టుకొస్తాయి. ఉద్యమాలు వెల్లువెత్తుతాయి. ప్రపంచంలోని అత్యధిక ప్రజల అస్తవ్యస్త పరిస్థితికి, ఆకలి దారిద్ర్యాలకు శ్రమదోపిడీ కారణమని మొట్టమొదట సశాస్త్రీయంగా చెప్పినవాడు కారల్ మార్క్స్. "ఆకలి మంటల మలమలలాడే అనాథలందరు లేవండోయ్!" అంటూ ఆయనిచ్చిన పిలుపు ప్రపంచ ప్రజలను ఉత్తేజితులను చేసింది. చేస్తూ ఉంది.

ఆకలి .. ఆకలి ..!

ఆకలి కేవలం ఆహార సంబంధిగానే ఉండదు కొంతమందికి. కొందరికి అంతు లేని సంపద మీద ఆకలి. కొండలు కోనలూ గనులూ పచ్చని వనాలూ ... అన్నిటినీ మింగేసేంత ఆకలిలో ఉంటారు. కొందరికి అధికారం మీద తీవ్రమైన ఆకలి. వాళ్లకు వీళ్లూ, వీళ్లకు వాళ్లూ సహకరించుకొని ఒకరి ఆకలిని మరొకరు తీర్చుకుంటూ ఉంటారు. మతాల మధ్య చిచ్చు పెట్టి, ఆ మంటల్లో చలికాచుకునే ఉన్మాదపు ఆకలి కొంతమందికి ఉంటుంది. శాంతి, సామరస్యం, సహనం, సౌభ్రాతృత్వం వంటి దినుసులు వాళ్లకసలు పడవు. ఈ తరహా విపరీత ఆకళ్ళను అరికట్టి, సమాజాన్ని ఆరోగ్యకరమైన దారిలో పెట్టాలంటే- ప్రజలే చైతన్యంతో తగిన చికిత్స అందించాల్సి ఉంటుంది.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పుడు టారిఫ్‌ల ఆకలితో అల్లాడిపోతుంటే- అంతకన్నా ముందునుంచే ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు దురాక్రమణ యుద్ధాకలితో దహించుకుపోతున్నాడు. అనేక దేశాలూ, ఐక్యరాజ్య సమితి వంటి అంతర్జాతీయ సంస్థలు హితవు చెబుతున్నా- అతడి యుద్ధ జ్వలనం చల్లారటం లేదు. 2023 అక్టోబరు నుంచి ఇప్పటివరకూ పాలస్తీనా మీదా, గాజా ప్రాంతం మీదా ఎడతెగని దాడులు చేసి, 67 వేల మందికి పైగా ప్రజలను పొట్టన పెట్టుకున్నాడు. యుద్ధ సూత్రాలకు అన్ని విధాలా చెల్లు చీటీ రాసి, నేరుగా ప్రజల మీద బాంబులు కురిపించాడు. పాఠశాలల మీద, ఆసుపత్రుల మీద, యుద్ధ బాధితులు తలదాచుకున్న శిబిరాల మీదా కర్కశంగా బాంబులు కురిపించి, యుద్ధట్యాంకులు నడిపించి రక్తదాహం తీర్చుకున్నాడు. ఇజ్రాయిల్ తాను అమానవీయంగా పేట్రేగిపోవటంతో పాటు ప్రపంచ దేశాల మానవతా సాయం గాజా ప్రజలకు అందకుండా అడ్డుకుంటోంది. వేలాది ఆహార ట్రక్కులను అడ్డగించింది. ఆహార పదార్థాలతో వచ్చిన ఓడలను అటకాయించి, వెనక్కు పంపేసింది. ఫలితంగా లక్షలాది మంది పాలస్తీనా పిల్లలూ ఆకలితో అల్లాడిపోతున్నారు. ఆధునిక కాలంలో ఇంతకుమించిన అనాగరిక, అమానుష దుష్కృత్యం మరొకటి లేదు. 'హమాస్ ఉగ్రవాదులే మా లక్ష్యం' అంటూ మొదలైన ఇజ్రాయేల్ యుద్ధాకలి ఇప్పుడు గాజాను సర్వ నాశనం చేసే దిశగా సాగుతోంది. "గాజాను స్వాధీనం చేసుకుంటాం" అని నిర్భయంగా, నిరంకుశంగా నెతన్యాహు ప్రభుత్వం ప్రకటించింది. ఆకలి అన్నార్తులనే బాధకు గురి చేస్తుంది. యుద్ధాకలి, దురాక్రమణ ఆకలి ఆరంభంలోనే సత్యాన్ని, మానవత్వాన్ని మింగేస్తాయి. అన్నార్తులను సృష్టిస్తాయి. మనుషులం అనుకున్న ఏ ఒక్కరూ ఈ పరిస్థితిని సహించకూడదు.

మహనీయుల మాట



జీవితం చాలా చిన్నది.
ప్రేమించడానికి, స్నేహితులను సంపాదించుకోవడానికి సమయం తక్కువ వుంది. ఎవరి ఇష్టాయిష్టాలు, ఆలోచనలు వారికుంటాయి.
భిన్నాభిప్రాయాలను గౌరవించాలి.

- హృషికేష్ ముఖర్జీ,
దాదాసాహెబ్ ఫాల్కే పురస్కార గ్రహీత.

పుస్తకాల నిషేధం-కాశ్మీర్ విషాదం

ప్రస్తుతం



తెలకపల్లి రవి

బ్రిటిష పాలకులు గరిమెళ్ల సత్యనారాయణ పాటల నుంచి, ఉన్నవ 'మాలపల్లి' నుంచి నిషేధించితే స్వాతంత్ర్య పోరాటం ఆగిపోలేదు. గోర్కి 'అమ్మ' నిషేధిస్తే పావెల్ వంటి వారు పుట్టకుండా పోలేదు. మతతత్వం, నిరంకుశత్వం మేళవించిన మోడీ సర్కారు వాస్తవ చరిత్రనూ, హక్కులపై అణచివేతను కప్పిపుచ్చితే నిజం కనుమరుగై పోదు. మరింత బెడిసికొడుతుంది. సుప్రీంకోర్టు కూడా ఇందుకు నిరాకరించవచ్చు. ఈ లోగా తప్పు దిద్దుకుని పరువు కాపాడుకుంటుందేమో చూద్దాం. నిషేధాలను నిరసిస్తూ సర్వశక్తులా సమైక్యమై పోరాడదాం.

జమ్ము కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా కార్యాలయం ఏక్ దమ్మున పాతిక పుస్తకాలను నిషేధించడం, ఆ వెంటనే వాటిని జప్తు చేసేందుకు పుస్తకశాలలపై దండయాత్రలకు పోలీసులకు ఆదేశాలివ్వడం ప్రపంచ వ్యాపిత చర్చకు దారితీసింది. మోడీ హయాంలో నిషేధాలు, ఆంక్షలు పరిపాటిగా మారిన మాట నిజమైనా భారత దేశ ప్రజాస్వామిక సంప్రదాయాల రీత్యా ఇంత నిరంకుశమేంటనే ప్రశ్న ప్రతిధ్వనించింది. విచిత్రమేమంటే నిషేధం తర్వాత ఈ రెండో రోజు దేశీయ మీడియా ముఖ్యంగా బడా మీడియా ఆ అంశంపై గప్‌చుప్‌గా వుండగా గార్డియన్, అల్ జజీరా తదితర అంతర్జాతీయ మీడియా దీనిపై విస్తృతంగా కథనాలిస్తున్నాయి. ఎమర్జెన్సీ యాభయ్యవ వార్షికం జరుపుతూ తామే ప్రజాస్వామ్య పరిరక్షకులమైనట్టు ఊరేగుతున్న మోడీ సర్కారు నిజ స్వరూపాన్ని ఈ నిషేధం బట్టబయలు చేసింది. ఏమంటే ఎమర్జెన్సీలో కూడా ఒకేసారి ఇన్ని రకాల పుస్తకాలను నిషేధించే ఉత్తర్వు వచ్చి వుండదు. దీనిపై మీడియా పెద్దగా స్పందించడం లేదంటే అప్రకటిత ఎమర్జెన్సీ అంటే ఏమిటో అర్థమవుతున్నది.

కాశ్మీర్‌కు రాజ్యాంగం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 370వ అధికరణాన్ని రద్దు చేసి ఆరేళ్లు పూర్తయ్యాయని హోంమంత్రి అమిత్ షా కు ఎ.పి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో సహా బిజెపి, ఎన్‌డిఎ నాయకులు కీర్తనలాలపిస్తున్న సమయంలోనే ఈ ప్రకటన వెలువడటం ప్రత్యేకంగా గమనించదగింది. అమిత్ షా సమర్థత వల్ల కాశ్మీర్‌లో పరిస్థితి ఎన్నడూ లేనంతగా అదుపులోకి వచ్చిందని ఎన్‌డిఎ సమావేశంలో జబ్బలు చరుచుకున్నారు. పహల్గాం ఘాతుకం తర్వాత అంతా వేగంగా సర్దుబాటు చేసినందుకు మోడీకి సత్కారమే చేశారు. మరో వంక గత వారం రోజులుగా ఉగ్రవాదుల ఏరివేత అంటూ వేట సాగిస్తున్నారు. ఇవన్నీ నిజమే అయితే ఎప్పటెప్పటివో ఈ పుస్తకాల వల్ల కలిగిన ప్రమాదం ఏముంటుంది? వాటిలో కొన్ని కొన్ని దశాబ్దాల కిందటి పరిస్థితిని వివరించేవే తప్ప తాజాగా రాసినవి కూడా కాదే? యువతను పక్కదోవ పట్టిస్తున్నాయని, ఉగ్రవాదులను గొప్ప చేసి సాయుధ దళాలను విలన్లుగా చూపిస్తూ తప్పుడు కథనాలు యువత బుర్రలో జొప్పిస్తున్నాయనే ఆరోపణతో నిషేధించడమంటే యువత అసంతృప్తి ఏమాత్రం తగ్గలేదని అర్థం చేసుకోక తప్పదు. మరి నిజంగా మోడీ, షా ద్వయం అంత అద్భుతంగా కాశ్మీర్‌ను బాగు చేసి వుంటే వారి తరపున యువత నిలబడేవారు తప్ప ఎవరో రాసిన పుస్తకాలతో కొట్టుకుపోతారా?

ప్రముఖ రచయితలపై వేటు

వాస్తవానికి ఈ పుస్తకాలు రాసిన వారెవరూ అల్లాటప్పా రచయితలు కాదు. విశ్వవిద్యాలయాలలో అధ్యాపకులూ న్యాయ శాస్త్రంలో ఆరితేరిన అధ్యయనపరులు, పత్రికా రంగంలో పట్టున్న పరిశోధకులని ఆ జాబితా చూస్తేనే తెలుస్తుంది.

తాము ఏ ఉగ్రవాదాన్ని సమర్థించలేదనీ, సాయుధ దళాలపై దాడి చేయడం అసత్యమనీ వారిలో చాలా మంది నిషేధం తర్వాత నిష్కర్షగా చెబుతున్నారు. పైగా వాటిని పాలకులే వివిధ సందర్భాలలో మెచ్చుకోవడం గుర్తు చేస్తున్నారు. ఉదాహరణకు డేవిడ్ దేవదాసు రాసిన భవిష్యత్తు కోసం అన్వేషణ (ఇన్ సెర్చ్ ఆఫ్ ఫ్యూచర్) అనే గ్రంథాన్ని 1988లో ఎన్‌డిఎ మాజీ కన్వీనర్, మాజీ రక్షణ మంత్రి జార్జి ఫెర్నాండెజ్ స్వయంగా ఆవిష్కరించారు. మరి కొన్నింటిని మాజీ ప్రధాని వాజ్‌పేయి ప్రశంసించారు. అరుంధతీ రాయ్ ప్రతిష్టాత్మక బుకర్ పురస్కారం పొందిన శక్తివంతమైన రచయిత్రి. మానవ హక్కుల కోసం పోరాడే వ్యక్తి. ఎ.జి. నురానీ అయితే రాజ్యాంగ సభ చర్చల నుంచి నాయకుల వ్యాఖ్యలు, ప్రసంగాలు, రచనల వరకూ తు.చ తప్పకుండా ఉటంకిస్తూ తప్ప ఏమీ చెప్పరు. ఆయన కాశ్మీర్ సమస్యను 1947-2012 వరకూ రాశారు గనక మోడీ సర్కారే లేదు. అలాంటప్పుడు 2025లో అది చేసే వ్యతిరేక ప్రచారం ఏముంటుంది? మిగిలిన ఆస్ట్రేలియాకు చెందిన క్రిస్టోఫర్ స్నెడెన్ 1993 తర్వాత ప్రత్యేకించి పరిశీలించి రాశారు. తన గ్రంథంలో వీసమెత్తయినా రెచ్చగొట్టే సమాచారం లేదని ఆయన సవాలు చేస్తున్నారు. ఈ చర్య మరింత పెద్ద దాడికి సూచన అన్నారు కాశ్మీర్ టైమ్స్ ఎడిటర్ అనురాధా బాసిన్, లండన్ ప్రొఫెసర్ సమంత్రా బాస్ కూడా అదే విధంగా ఆశ్చర్యం వెలిబుచ్చారు. ఇంటర్నెట్ ఫ్రీడం ఫెడరేషన్ (ఐ.ఎఫ్.ఎఫ్), ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటివి కూడా నిషేధంపై తీవ్ర నిరసన ప్రకటించాయి.

రాజకీయాలు, సాయుధ దళాలు

కాశ్మీర్ సమస్య నిజమైనప్పుడు-దాని మీద భారత్ పాకిస్తాన్‌ల మధ్య వివాదాలు ఘర్షణలు నడుస్తున్నప్పుడు... దేశంలో పాలక పార్టీలైన కాంగ్రెస్, బిజెపి రాష్ట్రంలో నేషనల్ కాన్ఫరెన్స్, పిడిపి, హురియత్ వంటివి విభిన్న వాదనలతో పని చేస్తున్నపుడు ప్రభుత్వాల ఏర్పాటు, కూల్చివేత, షేక్ అబ్దుల్లాతో సహా కీలక నేతల నిర్బంధాలు, విడుదలలు నడుస్తున్నప్పుడు రచయితలు వాటిని స్పృశించకూడదా? వారే ఆ లోతుపాతుల్లోకి వెళ్లి రాయకపోతే



ప్రజలకు విభిన్న కోణాలు, వాస్తవాలు ఎలా తెలుస్తాయి? పార్టీల వాదనలో ఏది నిజమో ఏది పొరబాటో ఎలా తెలుస్తుంది? పాకిస్తాన్ కుట్రల వల్ల ఉగ్రవాదానికి ఊతం లభించి కల్లోలం నెలకొన్న మాట నిజమే కానీ దేశంలో పాలకుల అవకాశవాదాల మాటేంటి? మాట మార్పులేంటి? కలయికలు ఫిరాయింపులు ఎన్ని జరగలేదు? వీటిని అక్షరబద్ధం చేయడం రచయితల బాధ్యత కదా? వారితో పూర్తిగా ఏకీభవించకపోయినా చరిత్ర, రాజకీయాలు, రాజ్యాంగం కోణాలను ఆవిష్కరించడం మరింత కీలకం కదా?

ఇక్కడ పదే పదే సాయుధ దళాల ప్రసక్తి తీసుకు రావడం సమస్యను పక్కదోవ పట్టించడమే. వాటికి వుండే విలువ, గౌరవం వుంటాయిగానీ ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ నిర్ణయాలు, పాలనా వ్యవస్థ కీలకం తప్ప సైన్యం సాయుధ బలగాలు కాదు. కాశ్మీర్‌తో సహా ఈశాన్య రాష్ట్రాలలోనూ కల్లోలిత ప్రాంతాల్లోనూ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ స్పెషల్ పవర్ యాక్ట్ (ఎ.ఎఫ్.ఎస్.పి.ఎ) కింద హక్కుల ఉల్లంఘనలు జరిగాయనే కేసులను పలు సార్లు సుప్రీం కోర్టు విచారణకు చేపట్టింది. నిజానికి ఇలాంటి సందర్భాల్లో వారిపై ప్రాసిక్యూషన్‌కు అనుమతివ్వాలని బిజెపి భాగస్వామిగా వున్న పిడిపి మిశ్రమ ప్రభుత్వమే కోరింది. కానీ ఆ చట్టం కింద కేంద్రం ముందస్తు అనుమతి లేకుండా వారిపై విచారణకు అనుమతించలేమని కోర్టు తేల్చిచెప్పింది. ఇవన్నీ వాస్తవాలైనప్పుడు ప్రసిద్ధ రచయితలు వాటిని పరిశీలించి పరిశోధించి రాయడం తప్పెలా అవుతుంది? నిషేధం ఎలా చెల్లుతుంది?

అసలు వ్యూహం అదే

భారతీయ న్యాయ సంహిత (బి.ఎన్.ఎస్) 152, 196, 197 సెక్షన్ల కింద వాటిని హఠాత్తుగా నిషేధించడానికి నిజానికి రాజకీయ కారణాలే వున్నాయి. మొదటిది విమర్శకుల నోరు నొక్కడం. మరెవరూ అందుకు సిద్ధపడకుండా చూడటం. చిలక పలుకుల్లా తమ ఘనతలూ, గొప్పలూ పాడుకోవాలి తప్ప స్వంతంగా క్షేత్ర స్థాయి పరిశీలించి విషయాలను, నిబంధనలను విడమర్చి చరిత్ర కోణాలు చెప్పకూడదు. దేశంలో ఓట్ల చౌర్యం, మీడియాపై దాడులు, ఉద్యమాల అణచివేత, మైనార్టీ మతాలపై మహిళలపై దాడులూ ఏకకాలంలో జరగడం నిజానికి పెద్ద రాజకీయ వ్యూహంలో భాగం. ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు నిరాకరించి తర్వాత సర్ జరిపించేయడం కోసం దానికి ఒప్పుకున్నా ఇప్పుడు ఇండియా వేదిక ఎన్నికల సంఘం బాగోతాన్ని బహిర్గతం చేసింది గనక దేశం దృష్టిని మళ్లించడానికి మరో అస్త్రం కావాలి. పహల్గాం పూర్వ రంగంలో కాశ్మీరీలలో వస్తున్న ప్రశ్నలకు సమాధానాలు కావాలి. స్వయంగా ఇదే లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా పహల్గాంలో నిఘా వైఫల్యాలు నిజమని స్పష్టంగా ఒప్పుకున్నారు. వాటిని చక్కదిద్దుకుని రాష్ట్ర ప్రజల విశ్వాసం చూరగొనడం, యువతకు ఉపాధి కల్పనతో ఉత్సాహ పర్చడం జరగాల్సి వుండగా ఉగ్రవాద ముద్రతో వేటాడటం పెరుగుతున్నది. నిఘాలో విఫలమైన కేంద్రం అందరికీ కనిపించే విలువైన పుస్తకాలపై విద్రోహ ముద్ర వేసి విరుచుకు పడటంలో వింతేమీ లేదు. ఈ సర్కారు వచ్చాక తమిళనాడులో పెరుమాళ్ మురుగన్‌పై దాడి చేసి రచయిత మరణించాడనే ప్రకటన చేయించారు. గోవింద్ పన్సారే, కల్బుర్గి, గౌరీ లంకేశ్ వంటి వారి ప్రాణాలే తీశారు. అప్పట్లో అది అవార్డు వాపసీకి దారి తీసింది. ఇదే క్రమంలో సినిమాలు, మీడియా, పుస్తకాలు, కార్యకర్తలు, ఎన్‌జివోలపై వరసగా దాడులు చేస్తూనే వున్నారు. చరిత్రను తిరగ రాసి మోడీనే మూల పురుషుడుగా హిందూత్వ శకాన్ని చూపించాలనుకున్న వారికి నిజమైన చరిత్రకారులు లేదా ప్రగతిశీల పరిశోధకులు ప్రమాదకరంగా గోచరిస్తారు. ఈ రచయితలు రాసిన వాటితో తేడాలుంటే తామూ రాయొచ్చు. అదేంటో చెప్పొచ్చు. అంతేగానీ దశాబ్దాల తర్వాత అవి వుండబోవంటూ నిషేధించడమేంటి? ఇది కాశ్మీర్‌లో విద్రోహ శక్తుల కుట్రలు మరింత పెరగడానికే కారణమవుతుందని ఈ నిషిద్ధ గ్రంథాల రచయితలు చేస్తున్న హెచ్చరిక సరైందే. అణచివేతలు, మానవ హక్కులు సాయుధ దళాల ఉల్లంఘనల గురించిన అధ్యయనాలను నిషేధించడం అంతకన్నా మరేం సంకేతమిస్తుంది? ప్రజలు ఎన్నుకున్న ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వానికి తెలియకుండా ఈ నిర్ణయం చేయడం వారి విశ్వాసానికి మరింత విఘాతం కలిగించదా?

బ్రిటిష పాలకులు గరిమెళ్ల సత్యనారాయణ పాటల నుంచి, ఉన్నవ 'మాలపల్లి' నుంచి నిషేధించితే స్వాతంత్ర్య పోరాటం ఆగిపోలేదు. గోర్కి 'అమ్మ' నిషేధిస్తే పావెల్ వంటి వారు పుట్టకుండా పోలేదు. మతతత్వం, నిరంకుశత్వం మేళవించిన మోడీ సర్కారు వాస్తవ చరిత్రనూ, హక్కులపై అణచివేతను కప్పిపుచ్చితే నిజం కనుమరుగై పోదు. మరింత బెడిసికొడుతుంది. సుప్రీంకోర్టు కూడా ఇందుకు నిరాకరించవచ్చు. ఈ లోగా తప్పు దిద్దుకుని పరువు కాపాడుకుంటుందేమో చూద్దాం. నిషేధాలను నిరసిస్తూ సర్వశక్తులా సమైక్యమై పోరాడదాం. ★

వాటిని హఠాత్తుగా నిషేధించడానికి నిజానికి రాజకీయ కారణాలే వున్నాయి. మొదటిది విమర్శకుల నోరు నొక్కడం. మరెవరూ అందుకు సిద్ధపడకుండా చూడటం. చిలక పలుకుల్లా తమ ఘనతలూ, గొప్పలూ పాడుకోవాలి తప్ప స్వంతంగా క్షేత్ర స్థాయి పరిశీలించి విషయాలను, నిబంధనలను విడమర్చి చరిత్ర కోణాలు చెప్పకూడదు. దేశంలో ఓట్ల చౌర్యం, మీడియాపై దాడులు, ఉద్యమాల అణచివేత, మైనార్టీ మతాలపై మహిళలపై దాడులూ ఏకకాలంలో జరగడం నిజానికి పెద్ద రాజకీయ వ్యూహంలో భాగం. ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు నిరాకరించి తర్వాత సర్ జరిపించేయడం కోసం దానికి ఒప్పుకున్నా ఇప్పుడు ఇండియా వేదిక ఎన్నికల సంఘం బాగోతాన్ని బహిర్గతం చేసింది గనక దేశం దృష్టిని మళ్లించడానికి మరో అస్త్రం కావాలి. పహల్గాం పూర్వ రంగంలో కాశ్మీరీలలో వస్తున్న ప్రశ్నలకు సమాధానాలు కావాలి. స్వయంగా ఇదే లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా పహల్గాంలో నిఘా వైఫల్యాలు నిజమని స్పష్టంగా ఒప్పుకున్నారు. వాటిని చక్కదిద్దుకుని రాష్ట్ర ప్రజల విశ్వాసం చూరగొనడం, యువతకు ఉపాధి కల్పనతో ఉత్సాహ పర్చడం జరగాల్సి వుండగా ఉగ్రవాద ముద్రతో వేటాడటం పెరుగుతున్నది. నిఘాలో విఫలమైన కేంద్రం అందరికీ కనిపించే విలువైన పుస్తకాలపై విద్రోహ ముద్ర వేసి విరుచుకు పడటంలో వింతేమీ లేదు.

బల్క్ డ్రగ్ పార్క్ వద్దంటే వినరే...!

విమర్శ



కె.లోకనాథం



నక్కపల్లిలో ఉన్న హెట్రో డ్రగ్స్ కంపెనీ తీవ్ర కాలుష్యం వెదజల్లుతుంది. రాజయ్యపేట, బోయపాడు, పెద్దతీనార్ల, చిన్నతీనార్ల వంటి మత్స్యకారుల గ్రామాల్లో కాలుష్యం వలన మత్స్య సంపద నాశనమై ఉపాధి లేకుండా పోయింది. దీనితో నాగార్జున సాగర్, ఒడిస్సా, పూరి తదితర ప్రాంతాలకు వలసలు వెళ్ళాల్సిన దుస్థితి ఏర్పడింది. కాలుష్య ప్రమాదం నుండి మత్స్యకారులు, చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు అనేక గుణపాఠాలు నేర్చుకున్నారు. బల్క్ డ్రగ్ పార్కుపై ప్రభుత్వాలు చెప్పే కల్లబొల్లి కబుర్లకు మోసపోకూడదనే కృతనిశ్చయంతో వారున్నారు. కాబట్టే బల్క్ డ్రగ్ పార్కు ప్రజాభిప్రాయ సేకరణలో ఎన్ని నిర్బంధాలు ప్రయోగించినా ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని తమ నిరసన గళాన్ని వినిపించారు.

ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా దేశంలో మూడు ప్రాంతాల్లో బల్క్ డ్రగ్ పార్కులను అభివృద్ధి చేయాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా ఆంధ్ర రాష్ట్రంలో అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రాంతంలో బల్గ్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు మొదలెట్టాయి. దీనిని నక్కపల్లి ఇండస్ట్రియల్ ఏరియా (ఎన్.ఐ.ఎ)గా ప్రకటించారు. ఈ పార్కు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, పెట్టుబడులను ఆకర్షించాలని పాలకవర్గం చూస్తున్నది. 2011 సంవత్సరం నుండి విశాఖ-చెన్నై కారిడార్ పెట్రో కెమికల్స్ పేరుతో తీర ప్రాంతం మొత్తం భూములను కారుచౌకగా పెట్టుబడిదారులకు అప్పగించే పనిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమగ్నమయ్యాయి. ఆత్మ నిర్భర్ భారత్ అంటే సాంప్రదాయ వృత్తులను నాశనం చేసి సన్న, చిన్నకారు రైతుల నుండి భూములను బలవంతంగా సేకరించి కొంత మంది పెట్టుబడిదారులకు అప్పగించడమేనా?

నక్కపల్లి మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆగస్టు 6న బల్క్ డ్రగ్ ప్రజాభిప్రాయ సేకరణ నియంతృత్వ పద్ధతిలో జరిగింది. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఈ భూములను ఏ ఉద్దేశంతో సేకరిస్తున్నారనేది బహిరంగంగా ప్రకటించాలి. భూ యజమానులకు నోటీసులు ఇవ్వాలి. గ్రామ సభలు నిర్వహించాలి. భూసేకరణం చట్టం అధ్యాయం-1, సెక్షన్-3 సబ్‌క్లాజ్-1 ప్రకారం 80 శాతం బాధిత కుటుంబాలు ముందస్తుగా అంగీకారం తెలియజేయాలి. ఇలాంటి ప్రజాతంత్ర అంశాలను పరిగణలోకి తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం మొండిగా ఆంధ్రప్రదేశ్ బల్క్‌డ్రగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేసింది. దీనికి ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ అనుబంధంగా వుంటుందని పేర్కొన్నారు. చట్టానికి లోబడి జీవోలు వుంటాయా? జీవోలకు లోబడి చట్టాలు వుంటాయా అనేది టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలి. చట్టానికి లోబడే జీవోలు వుండాలనేది జగమెరిగిన సత్యం. కాని కూటమి ప్రభుత్వం దీనికి భిన్నంగా వ్యవహరిస్తున్నది. పెట్టుబడిదారులకు సేవలు అందించి తరించే చర్యలకు పూనుకుంది. నిర్వాసితులు ఏమైనా పర్వాలేదు. పెట్టుబడులను ఆకర్షించడమే ప్రధానమైన పనిగా వున్నది. దీనికి కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలైన సహకారాలు అందిస్తున్నది. భూ సేకరణ-పునరావాసం-రీసెటిల్మెంట్ అయిన తరువాతే కంపెనీలకు ఆహ్వానం పలకాలి. కాని బల్క్‌డ్రగ్ పార్కులో 2013 భూసేకరణ చట్టానికి తిలోదకాలు ఇచ్చారు. బల్క్‌డ్రగ్ పార్కుకి 1270.80 ఎకరాల భూమిని సేకరిస్తున్నట్లు, రూ.1257.75 కోట్ల పెట్టుబడులు వస్తున్నట్లు ఇ.ఐ.ఎ రిపోర్టులో పేర్కొన్నారు. ఇప్పటి వరకు 454 ఎకరాలకు మాత్రమే అరకొర నష్టపరిహారం ఇచ్చారు. మిగిలిన 816 ఎకరాలకు 6(ఎ) నోటీసులు 2025 మే నెలలో ఇచ్చారు. దీనికి రైతులు 'మా భూములు ఇవ్వం' అని వ్యక్తిగతంగా అధికారులకు విన్నవించుకున్నారు. ఈ ప్రాంతంలో భూమి లేని కూలీలకు, వృత్తిదారులకు ఇవ్వాల్సిన నష్టపరిహారం, పునరావాసం వంటి అంశాలు శాస్త్రీయమైన పద్ధతిలో పరిష్కరించాల్సినవి ప్రాథమిక స్థాయిలోనే వున్నాయి. వీటన్నింటిని పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించడం ఎంత వరకు సమంజసం. ఇ.ఐ.ఎ రిపోర్టు అశాస్త్రీయంగా వున్నది. పర్యావరణ అనుమతుల్లేవు. నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వకుండా 2025 జనవరి 8న రాష్ట్ర ముఖ్యమంత్రి, డిప్యూటీ ముఖ్యమంత్రుల ఆధ్వర్యంలో గౌరవ ప్రధాన మంత్రిగారు విశాఖపట్నం నుండి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరగాల్సి వుండగా ఆర్డీవో స్థాయి అధికారితో జరిపారు. ఇప్పటి వరకు పర్యావరణ అనుమతులు రాకుండానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యథేచ్ఛగా చట్టాలను ఉల్లంఘించాయి. రాజయ్యపేట, పెద్దతీనార్ల, చిన్నతీనార్ల, సిహెచ్.ఎల్. పురం, జానకయ్య పేట, ఉపమాక, ఎన్.నర్సాపురం, ఎస్.రాయవరం మండలంలో గుడివాడ రెవెన్యూ గుర్రాజుపేట గ్రామాల్లో గ్రామ సభలు పెట్టడం, పంచాయితీల అనుమతులు తీసుకోవడం వంటి ప్రాథమిక అంశాలను కూడా పక్కన పెట్టి ఆగమేఘాల మీద మినీ కోనసీమగా ఉన్న ప్రాంతంలో పచ్చని కొబ్బరి, జీడి, మామిడి వంటి చెట్లను ధ్వంసం చేసి విస్తారమైన రోడ్ల నిర్మాణం చేపట్టారు. చట్ట ప్రకారం నడుచుకోవాలని రోజూ ప్రబోధించే రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ విధ్వంసం ఇంతగా జరుగుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదు? దీనిని చూసి స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

అందులో భాగంగానే ఆగస్టు 6న జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలందరూ రాజకీయాలను పక్కన పెట్టి ముక్త కంఠంతో మాకు బల్క్ డ్రగ్ పార్కు వద్దే వద్దని తమ అభిప్రాయాలను తెలియజేశారు. ప్రజాభిప్రాయ సేకరణను ప్రజాతంత్ర యుతంగా జరపాల్సింది పోయి నియంతృత్వంగా వ్యవహరించారు.

హోంమంత్రి నియోజకవర్గంలో ప్రజాభిప్రాయ సేకరణ జరగడంతో పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. రాజయ్యపేటలో ముందు రోజు స్పెషల్ పార్టీ పోలీసులు వందలాది మందితో కవాతు నిర్వహించి పికెట్ ఏర్పాటు చేశారు. మిగిలిన గ్రామాల్లో ముందస్తుగా ప్రజాభిప్రాయ సేకరణకు అనుకూలంగా మాట్లాడకపోతే మీ మీద కేసులు నమోదు చేస్తామని భయభ్రాంతులకు గురిచేశారు. సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎం.రాజేష్ ఇంట్లోకి నక్కపల్లి ఎస్.ఐ, వారి సిబ్బందితో చొరబడి భీభత్సం సృష్టించి మాటల్లో చెప్పలేని విధంగా దుర్భాషలాడి గోడకు గుద్దించి, అడ్డు వచ్చిన వారి తల్లిదండ్రులు, చెల్లెల్ని కూడా బయటకి ఈడ్చేశారు. సిపిఎం జిల్లా నేతలను గృహ నిర్బంధం చేసి తరువాత వారిని పోలీసు వాహనాల్లో ఎక్కించి రోజంతా అనేక ప్రాంతాలకు తిప్పారు. హోం మంత్రి నియోజకవర్గంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు. ఎన్నికల ముందు రాజయ్యపేట పరిసర ప్రాంతాల్లో పర్యటించిన సందర్భంగా ప్రస్తుత హోం మంత్రిగారు మాట్లాడుతూ తాను రాజకీయాలు చెప్పడానికి రాలేదన్నారు. హెటిరో పైపులైన్ రసాయనాల వల్ల మత్స్య సంపద నష్టపోయిందని, ఇప్పటికే 15 ఏళ్ళ పిల్లలకు కిడ్నీ వ్యాధులు వస్తున్నాయని, క్యాన్సర్ వంటి ప్రాణాంతక రోగాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారిని చూస్తే కడుపు తరుక్కు పోతున్నదని అన్నారు. భవిష్యత్‌లో రాజయ్యపేట అనే గ్రామం ఒకానొకప్పుడు వుండేదని చెప్పుకొనే రోజులు వస్తాయని తెలియజేశారు. మనం పోరాటం చేసి రాజయ్యపేట మత్స్యకారుల గ్రామాన్ని ప్రమాదం నుండి రక్షించుకోవాలని నాడు పిలుపునిచ్చారు. నేడు బల్క్ డ్రగ్ పార్కు పేరుతో ఆ ప్రాంతంలో వుండే మత్స్యకారులు, సన్న, చిన్నకారు రైతులు, వృత్తిదారులను తరిమివేసే చర్యలు చేపడుతున్నారు. అనకాపల్లి జిల్లాలో పరవాడ ఫార్మా, అచ్యుతాపురంలో ఎస్.ఇ.జెడ్ ఫార్మా కంపెనీలతో స్థానిక ప్రజలు ఎన్నో ఇక్కట్లు పడుతున్నారు. ఫార్మా కంపెనీల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అర్థాంతరంగా నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. యాజమాన్యాల నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏ కంపెనీ యాజమాన్యం మీద కనీసం చట్టబద్ధంగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పర్యావరణం విషతుల్యమౌతుంది. ప్రజలు భయంతో గ్రామాల్లో జీవించాల్సిన పరిస్థితి వుంది.

నక్కపల్లిలో ఉన్న హెట్రో డ్రగ్స్ కంపెనీ తీవ్ర కాలుష్యం వెదజల్లుతుంది. రాజయ్యపేట, బోయపాడు, పెద్దతీనార్ల, చిన్నతీనార్ల వంటి మత్స్యకారుల గ్రామాల్లో కాలుష్యం వలన మత్స్య సంపద నాశనమై ఉపాధి లేకుండా పోయింది. దీనితో నాగార్జున సాగర్, ఒడిస్సా, పూరి తదితర ప్రాంతాలకు వలసలు వెళ్ళాల్సిన దుస్థితి ఏర్పడింది. కాలుష్య ప్రమాదం నుండి మత్స్యకారులు, చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు అనేక గుణపాఠాలు నేర్చుకున్నారు. బల్క్ డ్రగ్ పార్కుపై ప్రభుత్వాలు చెప్పే కల్లబొల్లి కబుర్లకు మోసపోకూడదనే కృతనిశ్చయంతో వారున్నారు. కాబట్టే బల్క్ డ్రగ్ పార్కు ప్రజాభిప్రాయ సేకరణలో ఎన్ని నిర్బంధాలు ప్రయోగించినా ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని తమ నిరసన గళాన్ని వినిపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రాంత భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని బల్క్ డ్రగ్ పార్కు ప్రతిపాదనలను విరమించుకోవాలని విజ్ఞప్తి.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

దేశంలో 10 లక్షల టీచర్ పోస్టులు ఖాళీ

- పార్లమెంటరీ నివేదిక ఆందోళన

న్యూఢిల్లీ : దేశంలో పది లక్షల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని 368వ పార్లమెంటరీ నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా ప్రాథమిక, సెకండరీ పాఠశాలల్లో ఖాళీల సంఖ్య అధికంగా ఉన్నదని తెలిపింది. వీటిలో ఏడున్నర లక్షల పోస్టులు ఫౌండేషన్ స్థాయిలోనే ఖాళీగా ఉన్నాయని చెప్పింది. ఈ ఖాళీలను తక్షణమే భర్తీ చేయకపోతే దీర్ఘకాలిక పరిణామాలు సంభవిస్తాయని హెచ్చరించింది. ఖాళీలు కేవలం గ్రామీణ ప్రాంతాలలోని ప్రభుత్వ పాఠశాలలకే పరిమితం కాలేదని, కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాలలో కూడా 30-50 శాతం ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎత్తిచూపింది. శాశ్వత ప్రాతిపదికన ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా కాంట్రాక్టు సిబ్బందితో నెట్టుకొస్తున్నారని, దీనివల్ల విద్యలో నాణ్యత దెబ్బతింటోందని తెలిపింది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, పీడబ్ల్యూడీ కేటగిరీలకు రిజర్వేషన్లను సక్రమంగా వర్తింపజేయడం లేదని పార్లమెంటరీ నివేదిక వివరించింది. జూన్ నాటికి నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సిఈటీ) 54 శాతం గ్రూప్ ఏ పోస్టులు, 43 శాతం గ్రూప్ బీ పోస్టులు, 89 శాతం గ్రూప్ సీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపింది. 2019 నుంచి శాశ్వత ప్రాతిపదికన నియామకాలే జరగడం లేదని గుర్తు చేసింది. దీంతో ఆ సంస్థ విద్యా వ్యవస్థలో నాణ్యతా ప్రమాణాలను సమర్థవంతంగా నియంత్రించలేకపోతోందని, సమన్వయం లోపిస్తోందని చెప్పింది. నూతన రెగ్యులేటరీ ప్రతిపాదనలను కూడా నివేదిక తప్పుపట్టింది. ఉపాధ్యాయ విద్య అవసరానికి మించి కేంద్రీకృతం కావడంపై ఆందోళన వ్యక్తం చేసింది.

న్యాయం అడిగితే లాఠీలతో కొట్టారు

- ఆర్‌జి కర్ మృతురాలి తల్లిదండ్రులు

కొల్‌కతా : తమ కుమార్తె కేసులో తగిన న్యాయం చేయాలని శాంతియుతంగా నిరసన చేపట్టిన తమపై పోలీసులు లాఠీ ఛార్జి చేశారని ఆర్‌జి కర్ మృతురాలి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేశారు. న్యాయం చేయాలని అడిగినందుకు వారు తమ రక్తాన్ని కళ్లజూశారన్నారు. ఈ హత్యాచార ఘటన జరిగి ఏడాది కావడంతో 'నబన్నా అభియాన్' పేరుతో జూనియర్ వైద్యులు శనివారం రాష్ట్రంలో పలుచోట్ల ర్యాలీలు నిర్వహించారు. కొల్‌కతాలో జరిగిన ర్యాలీలో మృతురాలి తల్లిదండ్రులు పాల్గొన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలమైన ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పదవి నుంచి దిగిపోవాలని డిమాండ్ చేస్తూ..నిరసనకారులు రాష్ట్ర సచివాలయంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించారు. పోలీసులు లాఠీ ఛార్జి చేశారు. దీంతో తమకు గాయాలైనట్లు తల్లిదండ్రులు తెలిపారు. నుదిటిపై, చేతిపై గాయాలైనట్లు తల్లి చెప్పారు. పోలీసులు తనపై కూడా దాటి చేసినట్లు తండ్రి కూడా తెలిపారు.

ఢిల్లీలో గోడ కూలి 8 మంది మృతి

న్యూఢిల్లీ: ఢిల్లీలో ఘోర ప్రమాదం జరిగింది. దాదాపు 100 అడుగుల పొడవు ఉన్న గోడ ఒక్కసారి కూలిపోయింది. ఆ శిథిలాలన్నీ అక్కడే ఉన్న మురికివాడలపై పడ్డాయి. దీంతో ఎనిమిది మంది మరణించారు. అనేక మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జైత్‌పుర్‌లోని హరినగర్‌లో ఆ ఘటన జరిగింది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఓ ఇంటి గోడ కూలింది. ఘటనాస్థలిలో ఒక పాత ఆలయం ఉంది. ఆ పక్కనే అనేక మంది గుడిసెల్లో నివసిస్తున్నారు. శుక్రవారం రాత్రి కురిసన భారీ వర్షాలకు అకస్మాత్తుగా గోడ కూలింది. దీంతో అనేక మంది శిథిలాల కింద చిక్కుకున్నారు. ఎనిమిది మంది చనిపోయారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు బాలికలు ఉన్నట్లు సమాచారం. మృతులను షబీబుల్ (30), రబీబుల్ (30), అలీ (45), రుబీనా (25), డాలీ (25), రుఖ్సానా (6), హసీనా (7)గా అధికారులు గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కూలిపోయే స్థితిలో ఉన్న నివాసాలలో ఉండొద్దని అధికారులు వెల్లడించారు.

ప్రాంతీయ పార్టీల ఓట్లు లేవ్!

- లాలూ, నితీశ్ నియోజకవర్గాల్లో భారీగా ఓట్లకు గండి
- ఛిద్రంగా బీహార్ ఎన్నికల ముఖచిత్రం
- 'సర్'తో లక్షలాదిమంది ఓటుకు దూరం



జెడియు అధ్యక్షులు నితీష్‌కుమార్, ఆర్‌జెడి అధ్యక్షులు లాలూ ప్రసాద్‌యాదవ్

పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బిజెపి ప్రతిపాదించి, కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా అమల్లోకి తెచ్చిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ఆ రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్నే మార్చేస్తోంది. ఈ రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా ప్రాంతీయ పార్టీలదే హవా. ముఖ్యంగా ఆర్‌జెడి నేత లాలూ ప్రసాద్ యాదవ్, నితీశ్‌కుమార్ నేతృత్వంలోని జెడియు పార్టీల మధ్యే ప్రధాన పోటీ ఉంటుంది. ఈ పార్టీలకు చెందిన నేతలే ముఖ్యమంత్రులుగా బీహార్ పాలిస్తుంటారు. మోడీ సర్కార్ తెచ్చిన 'సర్'తో ఇప్పుడు వీరి ఆధిపత్యానికి గండిపడనుంది. ఆర్జేడీ నేత లాలూ ప్రసాద్‌యాదవ్ సొంత జిల్లా గోపాల్‌గంజ్‌లో ఆరు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. వీటిలో 15.10 శాతం ఓట్లను 'సర్' పేరుతో జాబితా నుంచి తొలగించారు. అలాగే బీహార్ ప్రస్తుత ముఖ్యమంత్రి, జేడీయూ నేత నితీశ్‌కుమార్ సొంత జిల్లా నలంద. ఇక్కడ ఏడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. వీటిలో మొత్తంగా ఆరు శాతం ఓట్లను 'సర్' పేరుతో ఓటర్ల జాబితా నుంచి ఎత్తేశారు. తొలగించబడిన ఓట్లన్నీ ఆ రెండు పార్టీల గెలుపోటములను తారుమారు చేసేవే కావడం గమనార్హం! బీహార్ రాష్ట్రంలోని మొత్తం 38 జిల్లాల్లోనూ ఇదే తరహాలో ప్రాంతీయ పార్టీల ఆధిపత్యానికి గండికొడుతూ ఓటర్ల జాబితాల నుంచి పేర్లు తొలగించారు. సీఈసీ ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో ఈ విషయాలన్నీ వెల్లడయ్యాయి. బీహార్‌లో ఎక్కువగా వలసలు, నిరుద్యోగంతో పాటు చదువుకోని వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. సీఈసీ పెట్టిన ధ్రువీకరణ పత్రాల మెలికతో భారీ సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కు కోల్పోతున్న విషయం తెలిసిందే.

ఓట్ల తొలగింపు ఇలా...

2025 జూన్ 24 నాటికి బీహార్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య 7.89 కోట్లు. వీరిలో 7.24 కోట్ల మంది ఓట్లు మాత్రమే కేంద్ర ఎన్నికల సంఘం ముసాయిదా ప్రతిలో ఉన్నాయి. 65.6 లక్షల (8 శాతం) ఓటర్ల పేర్లను ఆ జాబితా నుంచి తీసేశారు. తమ అభ్యంతరాలను ఓటర్లు సకాలంలో నమోదు చేసి, 'సర్' ధ్రువీకరించిన పత్రాలను చూపించలేకపోతే తుది జాబితా నుంచి వారందరి పేర్లు తొలగిస్తామని కేంద్రఎన్నికల సంఘం (సీఈసీ) ఇప్పటికే ప్రకటించింది.

బీహార్‌లో 'సర్' అమలు తర్వాత, గోపాల్‌గంజ్ జిల్లాలోని నియోజకవర్గాల నుంచి 15.10 శాతం ఓటర్ల పేర్లను తొలగించారు. సీమాంచల్‌లో నాలుగు నియోజకవర్గాలు ఉన్నాయి. వాటిలో పూర్ణియాలో 12.08 శాతం, కిషన్‌గంజ్ 11.82 శాతం, కతిహార్‌లో 8.27 శాతం , అరారియాలో 7.59 శాతం ఓటర్ల పేర్లను తొలగించారు. ఈ నాలుగు జిల్లాల్లో ముస్లిం జనాభా ఇతర జిల్లాల కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. నలంద జిల్లాలోని షేక్‌పురా నియోజకవర్గంలో 5.13 శాతం, అర్వాల్‌లో 6 శాతం, నలందలో 5.57 శాతం ఓట్లను తొలగించారు. బీహార్ రాజధాని పాట్నాలో 7.84 శాతం ఓటర్లను డ్రాఫ్ట్ జాబితాలో చేర్చలేదు.

ఇదీ 'సర్' లెక్క

బీహార్‌లోని 38 జిల్లాల్లో 'సర్' అమలు తర్వాత 22,34,501 మంది ఓటర్లు మరణించినట్టు గుర్తించారు. మరో 36,28,210 మంది ఓటర్లు వలస వచ్చినట్టు గుర్తించారు. 7,01,364 మంది ఓటర్లు ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు నమోదు చేసుకున్నారనే చెప్తూ, వారందరి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారు.

ఇంటి నెంబర్ '0'... ఓటర్లు 2.92 లక్షలు !

- బీహార్ ఓటర్ల జాబితా సిత్రాలు

పాట్నా : బీహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయి. ఈ నెల 1వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘం అప్‌లోడ్ చేసిన ముసాయిదా జాబితా తప్పుల తడకగా కన్పిస్తోంది. 0, 00, 000 ఇంటి నెంబర్లతో ఏకంగా 2,92,048 మంది ఓటర్లు ఉన్నట్లు విశ్లేషణలో తేలింది. ఓటర్ల జాబితాలలో కొన్ని తప్పులు దొర్లిన మాట నిజమేనని బీహార్ ప్రధాన ఎన్నికల కార్యాలయానికి చెందిన అధికారి ఒకరు అంగీకరించారు. 'కొన్ని సందర్భాలలో ఓటర్లు ఇంటి నెంబరు రాయలేదు. అందువల్ల ఓటర్ల ఇంటి నెంబరును సున్నాగా చూపడం జరిగింది. దానిని సరిచేసుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ వెబ్‌సైటు ఇప్పటికీ కల్పిస్తోంది. తప్పులను సరిచేసే ప్రయత్నం చేస్తున్నాం' అని డిప్యూటీ చీఫ్ ఎలక్టోరల్ అధికారి అశోక్ ప్రియదర్శి తెలిపారు. ప్రతిపక్ష నేతలు ఇప్పటికే సర్ ప్రక్రియపై విమర్శలు కురిపించారు. ఓటర్లను పెద్ద ఎత్తున తొలగించారని వారు ఆరోపించారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో అరవై ఐదు లక్షల ఓట్లు గల్లంతయ్యాయి. కాగా బీహార్‌లోని మగధ్, పాట్నా ప్రాంతాలలో '0' ఇంటి నెంబరుతో అత్యధిక ఓటర్లు కన్పించారు. ఔరంగాబాద్ జిల్లాలోని ఓబ్రా స్థానంలో అత్యధికంగా 6,637 మంది అలాంటి ఓటర్లు ఉండగా పుల్వారీ (5,905), మనేర్ (4,602), ఫర్బెస్‌గంజ్ (4,155), దానాపూర్ (4,063), గోపాల్‌గంజ్ (3,957), పాట్నా సాహిబ్ (3,806), హాజీపూర్ (3,802), దర్భాంగా (3,634), గయ టౌన్ (3,561)లో కూడా సున్నా ఇంటి నెంబరుతో గణనీయ సంఖ్యలో ఓటర్లు ఉన్నారు. రాష్ట్రంలో మొత్తంమీద 15 నియోజకవర్గాలలో ఒక్కో స్థానంలో మూడు వేల కంటే ఎక్కువ మంది ఓటర్లు సున్నా నెంబరు ఇంటిలో ఉంటున్నారు.

రాహుల్ ఆరోపణలపై ఇసి దర్యాప్తు చేయాలి

- శరద్ పవార్




ముంబయి: కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో చేసిన ఆరోపణలపై ఎన్‌సిపి (ఎస్పీ) అధ్యక్షుడు శరద్ పవార్ స్పందించారు. రాహుల్ సరైన ఆధారాలతోనే ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నిస్తున్నారన్నారు. ఈవిషయాన్ని పరిశీలించి దర్యాప్తు చేయాల్సిన బాధ్యత ఇసిపై ఉందన్నారు. మహారాష్ట్రలో ఎన్నికలకు ముందు ప్రతిపక్ష మహావికాస్ అఘాడి(ఎంవీఏ) మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందని అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా రాహుల్ అడిగే ప్రశ్నలకు ఈసీ సమాధానం చెప్పి తీరాలని అన్నారు. ఇండియా కూటమి నేతలకు రాహుల్ ఏర్పాటుచేసిన ప్రజెంటేషన్ కార్యక్రమానికి హాజరైన శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే చివరి వరసలో కూర్చోవడాన్ని కూడా బీజేపీ వివాదంగా మార్చాలని చూస్తోందని మండిపడ్డారు. ప్రజెంటేషన్ సమయంలో టీవీ స్క్రీన్ సరిగ్గా కనిపిస్తుందనే ఆలోచనతో తాను, ఫరూఖ్ అబ్దుల్లా, కర్నాటక సీఎం సిద్ధరామయ్య కూడా వెనక వరుసలోనే కూర్చున్నామని అన్నారు. ఇందులో వివాదం చేసే విషయం ఏముందని ప్రశ్నించారు. మరోవైపు సెప్టెంబర్ 9న జరగనున్న ఉప రాష్ట్రపతి ఎన్నికపై ఇండియా బ్లాక్ నేతలు ఇంకా ఓ అభిప్రాయానికి రాలేదని వెల్లడించారు.

బిజెపి కలిసే ప్రసక్తే లేదు

మహారాష్ట్ర రాజకీయాల్లో పవార్, ఠాక్రేల పేర్లకు ఉన్న ప్రాధాన్యం గురించి తెలిసిందే. ఇటీవల ఠాక్రే సోదరులు తిరిగి కలుసుకున్నట్లే.. ఎన్సీపీ (ఎస్పీ) అధ్యక్షుడు శరద్ పవార్ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధినేత అజిత్ పవార్ తో చేతులు కలపనున్నారని వార్తలు వస్తున్నాయి. ఇటీవల ముంబయిలో పవార్ కుటుంబానికి సంబంధించిన కార్యక్రమంలో ఇరువురు నేతలు కలిసి పాల్గొనడంతో ఈ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై శరద్ పవార్ స్పందిస్తూ.. అవన్నీ తప్పుడు ప్రచారాలని తోసిపుచ్చారు. బీజేపీ నేతృత్వంలోని కూటమికి తాను ఎప్పటికీ మద్దతివ్వనని స్పష్టం చేశారు.

పుతిన్‌తో ట్రంప్ భేటీ

- రష్యా, ఉక్రెయిన్ యుద్ధంపై చర్చలు
- ఆగస్టు 15న భేటీకానున్న ఇరు దేశాల అధ్యక్షులు



వాషింగ్టన్ డి సి : రష్యా అధ్యక్షుడు వ్లాదమిర్ పుతిన్‌తో ఆగస్టు 15న అలస్కాలో భేటీ కానున్నట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ట్రంప్ తన సామాజిక మాధ్యమం ట్రూ సోషల్‌లో " అమెరికా అధ్యక్షుడుగా నేను, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో అలస్కాలో సమావేశం కానున్నాం. దీనికి ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్నా. మరిన్ని విషయాలు త్వరలో వెల్లడిస్తాం " అని తెలిపారు. ఈ సమావేశంలో రష్యా , ఉక్రేయిన్‌ల మధ్య కాల్పుల విరమణపై ప్రదానంగా చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

అర్మేనియా, అజర్‌బైజాన్ శాంతి ఒప్పందం

అర్మేనియా, అజర్‌బైజాన్‌ల మధ్య దశాబ్దాల కాలంగా నడుస్తున్న వివాదాలకు తెరపడింది. వైట్ హౌస్‌లో ట్రంప్ సమక్షంలో ఇరు దేశాల నాయకులు శాంతి ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ రెండు దేశాలను అభినందించారు. **రష్యా,ఉక్రెయిన్ చర్చలు**

రష్యా, ఉక్రెయిన్ శాంతి చర్చల్లో పురోగతి సాధిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు . గత నెలన్నరలో రష్యా దాదాపు 25 వేల మందిని కోల్పోయింది. ఉక్రెయిన్ చాలా నష్టపోయింది. చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. మేము ఒప్పందానికి చాలా దగ్గరగా ఉన్నాం. భూభాగాల మార్పిడిపై చర్చిస్తాం. త్వరలో పూర్తి వివరాలు ప్రకటిస్తాం. నాటో ద్వారా యూరప్ దేశాలతో కలిసి పనిచేస్తున్నాం. వారు అద్భుతమైన నాయకులు. నాటో బడ్జెట్‌ను 2% నుంచి 5%కు పెంచడానికి అంగీకరించిందని ఆయన తెలిపారు.. మరోవైపు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పందిస్తూ తమ దేశ సమగ్రతను దెబ్బతీసే ఏ చర్యను మేము అంగీకరించం, మా గళం లేని సమావేశం పరిష్కారం చూపదు, ఉదారంగా మా భూభాగాన్ని వదులుకోమని స్పష్టం చేశారు.

భూభాగాన్ని వదులుకోం: జెలెన్‌స్కీ

మూడున్నరేండ్లకుపైగా కొనసాగుతోన్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి తెర పడలేదు. శాంతి ఒప్పందంలో భూభాగాల మార్పిడి ఉంటుందనే సంకేతాలిచ్చారు. అయితే దీన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తోసిపుచ్చారు. శాంతి కోసం భూభాగాన్ని వదులుకోబోమని తేల్చిచెప్పారు.

పోర్ట్ బ్లెయిర్‌లో విద్యుత్ కోతలకు నిరసనగా సిపిఎం క్యాండిల్ లైట్ మార్చ్

పోర్ట్‌బ్లెయిర్ : అండమాన్ నికోబర్‌లో విద్యుత్ కోతలతో ప్రజలు సతమతమవుతున్నారు. ఇక్కడ నిరంతర విద్యుత్ కోతలను సిపిఎం తీవ్రంగా ఖండించింది. విద్యుత్ కోతలకు వ్యతిరేకంగా శనివారం రాత్రి సిపిఎం పోర్ట్‌బ్లెయిర్ పట్టణ కమిటీ నేతృత్వంలో క్యాండిల్ లైట్ మార్చ్‌ను నిర్వహించారు. మోహన్‌పుర ప్రాంతంలోని గాంధీ విగ్రహం నుంచి మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం వరకూ ఈ మార్చ్ జరిగింది. సిపిఎం కార్యకర్తలు, మద్దతుదారులు, సాధారణ ప్రజలు ఈ మార్చ్‌లో పాల్గొన్నారు. ఈ మార్చ్‌లో పాల్గొన్న పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ డి అయ్యప్పన్ మాట్లాడుతూ నిరంత విద్యుత్ కోతలకు మోడీ ప్రభుత్వమే కారణమని విమర్శించారు. అండమాన్ నికోబర్‌లో సమస్యలను పరిష్కరించడంలో మోడీ ప్రభుత్వం విఫలం చెందిందని తెలిపారు. రానున్న రోజుల్లో కూడా పార్టీ ఆందోళనలను కొనసాగిస్తుందని తెలిపారు.



విద్యుత్ కోతలకు వ్యతిరేకంగా క్యాండిల్ లైట్ మార్చ్ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

మోడీ, జిన్‌పింగ్‌తో పుతిన్ టెలిఫోన్ చర్చలు

మాస్కో/న్యూఢిల్లీ : రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుక్రవారం భారత ప్రధాని నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో టెలిఫోన్ సంభాషణలు జరిపారు. ఈ నెల 17న అలస్కాలో పుతిన్‌తో సమావేశమవుతానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన నేపథ్యంలో జరిగిన ఈ టెలిఫోన్ సంభాషణలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఉక్రెయిన్‌తో జరుపుతున్న పోరుకు వెంటనే స్వస్తి చెప్పాలని పుతిన్‌కు ట్రంప్ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. అయితే పోరు ఆపాలంటే ప్రధాన ప్రాదేశిక రాయితీలకు ఉక్రెయిన్ అంగీకరించాలని పుతిన్ డిమాండ్ చేస్తున్నారని వాల్ స్ట్రీట్ జర్నల్ పత్రిక తెలిపింది.

రష్యా నుంచి చమురు కొనుగోలును కొనసాగిస్తే జరిమానాగా పాతిక శాతం టారిఫ్ కట్టాల్సి ఉంటుందని భారత్‌ను ట్రంప్ బెదిరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పుతిన్, మోడీ మధ్య సంప్రదింపులు జరగడం గమనార్హం. పుతిన్‌తో టెలిఫోన్ చర్చల అనంతరం మోడీ మాట్లాడుతూ రష్యా నేతతో 'చాలా మంచి, సవివరమైన సంభాషణ' జరిగిందని వ్యాఖ్యానించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధ తాజా పరిణామాలను మోడీకి పుతిన్ వివరించారు. 'ద్వైపాక్షిక అజెండాలో పురోగతిని కూడా మేము సమీక్షించాం. రెండు దేశాల ప్రత్యేక, విశేష వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకుపోవాలని నిర్ణయించాం' అని మోడీ తెలిపారు. కాగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో కూడా పుతిన్ ఫోన్‌లో మాట్లాడారు. ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్‌తో తాను జరిపిన సమావేశం గురించి తెలియజేశారు. దీర్ఘకాలిక ప్రాతిపదికన ఉక్రెయిన్ సంక్షోభానికి పరిష్కారం సాధించాలని జిన్‌పింగ్ సూచించారు. రష్యా యుద్ధానికి మద్దతు ఇస్తున్న చైనా శాంతి స్థాపనకు, చర్చలు జరగడానికి కృషి చేస్తుందని తెలిపారు. కాగా విట్‌కాఫ్‌తో పుతిన్ జరిపిన చర్చలు మంచి ఫలితాన్ని, పురోగతిని ఇచ్చాయని ట్రంప్ తెలిపారు.

స్వామినాథన్‌నే శరణ్యం

- శత జయంతి ముగింపు సభలో వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో వ్యవసాయ రంగం సమూలంగా మార్పు చెందాలంటే ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్. స్వామినాథన్ చూపించిన మార్గంలో పయనించాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. ఆయన బోధనల నుంచి, దార్శనికత నుంచి అందరం స్ఫూర్తిని పొందాలన్నారు. శనివారం సి.సుబ్రమణ్యం ఆడిటోరియంలో ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంఎస్ స్వామినాథన్ శత జయంతి ముగింపు కార్యక్రమం జరిగింది.

డోపింగ్ కేసుల్లో టాప్‌లో భారత్

- రాజ్యసభలో క్రీడామంత్రి మన్సుఖ్ మాండవీయ వెల్లడి

న్యూఢిల్లీ : 2024లో జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ(నాడా) డోపింగ్ కేసుల్లో భారత్ అగ్రస్థానంలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో క్రీడా మంత్రిత్వశాఖ వెల్లడించింది. భారత అథ్లెట్లు డోపింగ్ నిరోధలకు పాల్పడుతున్నారన్న విషయం ప్రభుత్వానికి తెలుసా? అని రాజ్యసభ ఎంపి ఇమ్రాన్ ప్రతాప్‌గఢి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ మంత్రిత్వశాఖ పై విధంగా సమాధానమిచ్చింది. క్రీడల్లో డోపింగ్ ముప్పును అరికట్టడానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉన్నట్లు క్రీడా మంత్రి మన్సుఖ్ మాండవీయ తెలిపారు. 2024 ఏడాదిలో ప్రపంచ దేశాల్లోకెల్లా అత్యధికంగా 260మంది అథ్లెట్లకు పాజిటివ్ వచ్చినట్లు పేర్కొంది. గత ఏడాది మొత్తం 7,466మంది అథ్లెట్లకు పరీక్షలు నిర్వహించగా.. 260 అథ్లెట్లకు పాజిటివ్‌గా వచ్చినట్లు, ఇది 2019 నమోదైన 224 మార్క్‌ను అధిగమించినట్లు క్రీడా మంత్రిత్వశాఖ తెలిపింది.



పి.గోవింద పిళ్లై శత జయంతి కార్యక్రమంలో కేరళ సిఎం విజయన్, బృందాకరత్ తదితరులు

లౌకికవాద పరిరక్షణ కోసం నాయకత్వం వహించండి

- కేరళను కోరిన బృందా కరత్

తిరువనంతపురం : భారతీయ లౌకికవాదాన్ని, వైవిధ్యభరితమైన సాంస్కృతిక బహుళత్వాన్ని పరిరక్షించేందుకు నాయకత్వ స్థానాన్ని చేపట్టాలని సీపీఐ (ఎం) సీనియర్ నేత బృందా కరత్ కేరళను కోరారు. ప్రముఖ మార్క్సిస్టు మేధావి పి.గోవింద పిళ్లై శత జయంతి సందర్భంగా తిరువనంతపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'సమకాలీన భారత్‌లో సాంస్కృతిక రాజకీయాలు' అనే అంశంపై ఆమె ప్రసంగించారు. దేశ బహుళత్వ గుర్తింపునకు నయా ఉదారవాద, మితవాద శక్తుల నుంచి ముప్పు పొంచి ఉన్నదని బృందా కరత్ చెప్పారు. భిన్నత్వంలో సాంస్కృతిక ఏకత్వం అనే సుసంపన్నమైన చరిత్ర కలిగిన కేరళ రాష్ట్రం దేశంలోని మిగిలిన ప్రాంతానికి వెలుగు చూపాలని ఆకాంక్షించారు.

సమానత్వానికి, లౌకికవాదానికి సవాళ్లు ఎదురవుతున్నాయని, న్యాయం కోసం పోరాటాలు చేసిన సుదీర్ఘ చరిత్ర కలిగిన కేరళ రాష్ట్రం ఓ ఉదాహరణగా నిలవాలని బృందా కరత్ కోరారు. పౌరుల్ని వినియోగదారులుగా మార్చిన నయా ఉదారవాదాన్ని ఆమె తీవ్రంగా విమర్శిస్తూ ఈ ఆర్థిక భావజాలం ప్రజల హక్కులు, గౌరవాన్ని హరించిందని చెప్పారు. 'నేను వినియోగదారుని అయితే కన్పిస్తాను. పేదనో, వలస కార్మికురాలినో, కార్మిక వర్గానికి చెందిన దానినో అయితే నాకు గుర్తింపు ఉండదు. ఈ నయా ఉదారవాద దృక్పథం వ్యక్తివాదాన్ని, దురాశను పెంచుతుంది. దీనినే భారత్ ఆకాంక్షగా చిత్రీకరిస్తున్నారు. అయితే తీవ్ర అసమానతలు ఉన్న ఈ సమాజంలో న్యాయంగా లేని ఆకాంక్షలు నిరాశకు, సామాజిక నాశనానికి మాత్రమే దారితీస్తాయి' అని అన్నారు. ఒకే మతానికి గుర్తింపు ఇవ్వడం ద్వారా భారతీయ సంస్కృతిని ఆర్‌ఎస్‌ఎస్ గుత్తాధిపత్య ధోరణిలో చూస్తోందని బృందా కరత్ విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్ సాంస్కృతిక జాతీయతావాదం భారతీయ బహుళ సంప్రదాయాలను అణచివేస్తోందని, హిందూయిజాన్ని పునర్నిర్వచిస్తోందని మండిపడ్డారు. కులాన్ని, పితృస్వామ్యాన్ని ప్రోత్సహిస్తున్న మనుస్మృతి భాగాలపై మౌనం ఎందుకని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న వారు విశ్వాసాలలో భిన్నత్వాన్ని తమ రాజకీయ అజెండాకు అనుగుణంగా సజాతీయ సాంస్కృతిక రూపంగా మార్చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. బజరంగ్‌దళ్ సభ్యుల దాడికి గురైన ఇద్దరు క్రైస్తవ సన్యాసినులను ఇటీవల తాను జైలులో కలిశానని గుర్తు చేశారు. వారిలో ఒకరైన సిస్టర్ ప్రీతి మేరి తనపై దాడి చేసినందుకో, తనను జైలులో పెట్టినందుకో బాధపడడం లేదని, తనను చెద పురుగు అన్నందుకు ఏడ్చారని చెప్పారు. 'ఈ రకమైన భాష ఆమోదయోగ్యం కాదు. విద్వేషపూరిత గుర్తింపులు సృష్టించే అమానుష సంస్కృతిలో ఇది ఒక భాగం' అని తెలిపారు. భారతీయ సంస్కృతి, చారిత్రక గుర్తింపును తిరగరాసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రతిఘటించాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. గతాన్ని పరిరక్షించుకోవడానికే కాకుండా న్యాయసమ్మతమైన, సమాన భవిష్యత్తు కోసం ఇలాంటి భావజాలాలలో ధైర్యంగా పోరాడాలని బృందా కరత్ కోరారు. శత జయంతి ఉత్సవాలను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రారంభిస్తూ పి.గోవింద పిళ్లైకి ఘనంగా నివాళులు అర్పించారు.



జీవన సౌరభం

ప్రతి అవకాశంలోనూ కొన్ని అడ్డంకులు, ప్రతి అడ్డంకి వెనుకా కొన్ని అవకాశాలు ఉంటాయి.

మీ కోసం

ఒక టేబుల్ స్పూన్ మెంతులను లేదా మెంతిపొడిని నీటిలో కలుపుకొని రోజూ తాగుతూవుంటే శరీరంలోని అధిక వేడి నుంచి ఉపశమనం లభిస్తుంది.



JEEVANA జీవన the family

మా ఊరి కథ

ఈ కథ మా ఊరి కథ. మా ఊరు అడవికి దగ్గరగా ఉంటుంది. పక్కనే గోదావరి నది. ఎంతో అందంగా చుట్టూ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. అలాంటి వాతావరణాన్ని రహదారుల విస్తరణ కోసమని పాడుచేస్తున్నారు. అడవిలో ఉన్న పెద్ద పెద్ద చెట్లని నరికేశారు, గోదావరిలో నానా చెత్తాచెదారం వేసి కలుషితం చేస్తున్నారు. ఏ విచక్షణా లేకుండా భవిష్యత్తు తరాలకి ఎంతో ముఖ్యమైన పర్యావరణాన్ని పాడు చేస్తున్నారు. ఇప్పుడు మాకు తాగడానికి స్వచ్ఛమైన నీరు దొరకడం కష్టమవుతోంది. పీల్చడానికి స్వచ్ఛమైన గాలి దొరకడం లేదు.

అడవులు, నదులు ఇవన్నీ మన జీవనంలో భాగం. అలాంటి వాటిని మన జీవితం నుండి వేరు చేస్తున్నారు. ఎవరో ఒకరు మాత్రమే దీనికి బాధ్యత వహించడం కాదు. ప్రతి ఒక్కరూ ఇది నా బాధ్యత అనుకున్నప్పుడే మన చుట్టూ ఉన్న పర్యావరణం మనకి అనుకూలంగా ఉంటుంది. దీనిపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి. ప్రతి ఒక్కరూ దీని గురించి తెలుసుకోవాలి. ఇది మా ఊరి కథ మాత్రమే కాదు; ప్రతి ఊరి కథ ఇప్పుడు ఇలాగే కనిపిస్తోంది.





- ఎ. మోహిత్
7వ తరగతి,
అరవింద హైస్కూల్,
కుంచనపల్లి.

తరగని సిరులు



విమానం రాకెట్లు చూడగా,
కనిపించు ఒక్క మాదిరిగా
విమానం కంటె దూసుకొని పోవు
రాకెట్ల వేగము గమనించు

కాన్వెంట్ల చదివే బాలల రూపం,
ప్రభుత్వ బడులలో పిల్లల వేషం,
యెటులున్ననేమి బయటి ఆకారం
శ్రమించిన చదువే విద్యకు మూలం

నలుపు కాకి అరుపు వింటే జనం
కోపంగ కసరి కొడతారు నిజం,
కోకిల గొంతు ప్రీతిగా వింటారు
రంగులో లేదు మాటల కలదు

మంచి మాటలే పెట్టని కోటలు,
బంగరు బాటలే మేటి పనులు,
సరి మిత్రులతో ఆటలు చదువులు
పసిడి భవితకు తరగని సిరులు!

- డా.బెహరా ఉమామహేశ్వరరావు,
92900 61336.

నేను గీసిన బొమ్మ





సాత్విక,
5వ తరగతి,
సెయింట్ జోసెఫ్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్,
ఎన్ఆర్ పేట, కర్నూలు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆ పిల్లలూ ఆడిపాడాలని...

నృత్యకళ అందరికీ అబ్బేది కాదు. ఎంతో సాధన చేస్తే గాని ఒక పట్టాన ఒంటబట్టదు. కఠోర శిక్షణ అంతకుమించి ఏకాగ్రత ఉంటేనే ఆ కళలో రాణించగలరు. అయితే తమిళనాడుకి చెందిన భరతనాట్యం, కూచిపూడి నాట్యకారిని, విద్యావేత్త అయిన అంబికా కామేశ్వర ఆ పరిస్థితిని అధిగమించి చూపించారు. ఆటిజం, సెరిబ్రల్ పాలసీ, డౌన్ సిండ్రోమ్, దృష్టిలోపం, అభ్యసనా లోపం ఉన్న చిన్నారులకు వివిధ కళల్లో శిక్షణ ఇస్తున్నారు. పిల్లల సామర్థ్యం పెంచేలా థియేటర్స్ (వేదికలు) సాయపడగలవా? అని ఆమె 36 ఏళ్ల క్రితం వేసుకున్న ప్రశ్నకి సమాధానంగా అంబిక ప్రారంభించిన నాట్యకేంద్రాల్లో ఇప్పుడు 375 మంది వైకల్య బాధిత పిల్లలు నృత్యకళలో శిక్షణ తీసుకుంటున్నారు. స్వయంగా ప్రదర్శనలూ ఇస్తున్నారు.

18 ఏళ్ల వయసుకే నృత్య అభ్యాసకురాలిగా ప్రయాణం మొదలుపెట్టిన అంబికా తొలి క్లాసు దృష్టిలోపం ఉన్న పిల్లలకు తీసుకోవాల్సి వచ్చింది. ఆ రోజు తన అనుభవాన్ని ఆమె ఇలా చెప్పారు. 'బెంగళూరు రమణ మహర్షి అకాడెమీ వార్షికోత్సవ సందర్భంగా ఆ పిల్లలకు డ్యాన్సు నేర్పించమన్నారు. అది నాకు వచ్చిన పెద్ద సవాల్. కానీ ఆశ్చర్యంగా ఆ పిల్లలు నన్ను అబ్బురపరిచారు. నా చేతి కదలికలు, శరీర భంగిమలను చూడకుండా, కేవలం తాకుతూనే అదే భంగిమని పర్‌ఫెక్ట్‌గా చేశారు. ఆ ప్రదర్శన జరిగిన రోజు అక్కడ కరతాళ ధ్వనులు మోగాయి. కానీ నాకు అవేమీ వినిపించలేదు. ఆ పిల్లల ఆత్మవిశ్వాసం, వారి సామర్థ్యం, శక్తి, వాళ్లకై వాళ్లు నిర్మించుకున్న గుర్తింపు కనిపించాయి. అప్పుడే ఎంతోకాలం నుండి నేను వెతుకుతున్న ప్రశ్నకి సమాధానం దొరికిందని అర్థమైంది' అంటున్న అంబిక 'నేర్చుకున్న వారి అనుభవం, నేర్పించిన నా అనుభవం రెండూ కొత్తవే. అయినా సాధించాం' అని తొలి అనుభవాన్ని పంచుకున్నారు.





పెళ్లి తరువాత తమిళనాడులో స్థిరపడిన అంబిక ప్రపంచం అప్పటి నుండి కొత్త మార్గాల్లో విస్తరించింది. ఆమె సోదరి పూనమ్ స్థాపించిన 'స్పాస్టిక్ సొసైటీ ఆఫ్ ఇండియా' అనే సంస్థలో స్వచ్ఛంద సేవ చేశారు. అక్కడి పిల్లలతో పనిచేయడం వల్ల విద్యకి దూరమైన పిల్లల్లో కళలు ఎంత ప్రభావం చూపిస్తాయో ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.

బోధకురాలిగా మారినా అంబిక నేర్చుకోవడం మాత్రం ఎప్పుడూ ఆపలేదు. నాట్యాభినయం (భారతీయ శాస్త్రీయ నృత్యంలో వ్యక్తీకరణ కళ)పై పిహెచ్‌డి చేశారు. నాట్యా(నృత్యం, నాటకం)న్ని సమగ్ర అభివృద్ధి సాధనంగా అన్వయించడంపై పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌ని పూర్తిచేశారు. కొంతకాలం జర్నలిజాన్ని కూడా అధ్యయనం చేశారు. ఇన్ని చేస్తున్నా బోధకురాలిగా తనకి వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ ప్రయాణంలోనే పారా అథ్లెట్, మూడు సార్లు ఒలింపిక్ బంగారు పతకం సాధించిన డౌన్‌సిండ్రోమ్ బాధిత బబ్లీ రామచంద్రన్‌ని అంబిక కలిశారు. ఆ కలయిక బబ్లీని అరంగేట్రం చేసేదాకా తీసుకెళ్లింది. బబ్లీ తనను తాను నాట్యకారిణిగా గర్వంగా చెప్పుకుంటుంది. ఈ విజయాన్ని అంబిక ఇలా చెబుతారు. 'అవకాశానికి ప్రోత్సాహం తోడైతే ఏం సాధించవచ్చో బబ్లీ నిరూపించింది' అంటారు.

పిల్లల సామర్థ్యం పెంచేలా అంబిక స్కూలు స్కూలుకి తిరిగి మరీ అభ్యసనా తరగతులు తీసుకోవడం వంటి అనుభవాలు చాలా ఉన్నాయి.. 1989లో 'రమణ సన్‌రిత్య ఆలయ (రస)' పేరుతో శిక్షణా కేంద్రం ప్రారంభించినప్పటి నుండి అంబిక ప్రయాణం ఎంతోమందిలో ఆత్మవిశ్వాసాన్ని, అంతకుమించి సామర్థ్యాన్ని వెలికితీసింది.

'రస' గురించి అంబిక మాట్లాడుతూ "రస' తరగతి గదుల్లో బ్లాకు బోర్డులు ఉండవు. సబ్జెక్టులు, వరుసలు, డెస్కులు ఉండవు. అక్కడంతా వెలుగు ప్రసరిస్తుంటుంది. గోడలన్నీ రంగులతో నిండిపోయి వుంటాయి. పిల్లలు లయబద్ధంగా శరీరాన్ని కదిలిస్తూ డ్యాన్స్, నాటకాలు, కథలు చెప్పడం వంటి కళల్లో శిక్షణ తీసుకుంటూ ఉంటారు' అంటారు.

చాలా చిన్నదిగా మొదలైన ఈ ప్రయాణం ఇప్పుడు మూడు కేంద్రాలకు విస్తరించింది. చెన్నైలో రెండు, బెంగళూరులో ఒకటి నిర్వహిస్తున్నారు. 75 మంది స్కాలర్లు, 50 మంది ఆన్‌లైన్ లెర్నర్స్, 250 మంది ప్రదర్శనలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న విద్యార్థులతో ఆ కేంద్రాలు నడుస్తున్నాయి. 20 మంది విద్యార్థులు పూర్తికాల విద్యని అభ్యసించి అరంగేట్రం ఇచ్చేందుకు కూడా సిద్ధమయ్యారు. ఆ పిల్లల పట్ల అంబిక చూపిస్తున్న శ్రద్ధని ఇంతవరకే చెబితే సరిపోదు. ఈ విద్యని ఆమె ఉచితంగా బోధిస్తున్నారని తప్పకుండా చెప్పాలి. దాతల సహకారంతోనే అంబిక ఈ బృహత్తర కార్యక్రమాన్ని నడిపిస్తున్నారు.

'రస' గురించి అంబిక ఇలా చెబుతారు. 'పిల్లల సంఖ్యతో 'రస' నిండిపోదు. ఇది ఎన్నో అనుభూతుల కలయిక' అంటారు. ఇంకా 'రస' తనకి ఇచ్చిన ఎన్నో సంతోషాల గురించి కూడా ఆమె ప్రస్తావించారు. సెరిబ్రల్ పాలసీ అర్జున్, డౌన్ సిండ్రోమ్ బాధిత గురుశంకర్ ప్రదర్శన ఇచ్చిన రోజు ప్రేక్షకుల చప్పట్లకి వాళ్ల కళ్లల్లో కనిపించిన ఆనందం అంతాఇంతా కాదు. డిసెంబరు 2024లో 'రస' స్టార్‌గా బబ్లీ రామచంద్రన్‌ని సత్కరించడం, తనను ముఖ్య అతిథిగా పిలిచి ప్రోగ్రామ్‌లు నిర్వహించడం గురించి కూడా ఆమె చెప్పారు. ఇంకా ఈ కళ మరింత మందికి చేరువయ్యేలా మరిన్ని కేంద్రాలు నెలకొల్పాలని అంబిక ఆశపడుతున్నారు. ఎందరో వైకల్యబాధిత పిల్లల కళ్లల్లో ఆనందం తొణికిసలాడాలని, ఆమె కల నెరవేరాలని మనమూ కోరుకుందాం.





కార్మికులను విడదీసే ఒప్పందాన్ని ఒప్పుకోం

మరింత ఉధృతంగా ఆందోళన : 11న కృష్ణానగర్ నుంచి మహా ప్రదర్శన

తెలుగు సినిమా కార్మికుల పోరుబాట కొనసాగుతూనే ఉంది. 30 శాతం వేతన సవరణ అయ్యే వరకూ షూటింగ్‌లకు కార్మికులు హాజరుకాబోరని ఫిలిం కార్మికుల ఫెడరేషన్ స్పష్టంచేశారు. షరతుల మేరకు సినీ కార్మికుల వేతనాలను పెంచేందుకు సుముఖంగా ఉన్నట్లు నిర్మాతలు వెల్లడించారు. శనివారం సుదీర్ఘ చర్చల అనంతరం విలేకరులతో మాట్లాడారు. మొత్తం మూడు విడతలుగా వేతనాలు పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. నిర్మాతలు తీసుకున్న నిర్ణయాన్ని ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి దామోదర ప్రసాద్ తెలియజేస్తూ.. "రోజుకు రూ.2 వేల కన్నా తక్కువ తీసుకుంటున్న వారికి వేతనాలు పెంచాలని నిర్ణయించాం. మొదటి సంవత్సరం 15 శాతం, రెండో సంవత్సరం 5 శాతం, మూడో ఏడాది 5 శాతం పెంచుతాం. రూ.1000 కంటే తక్కువ వేతనం ఉన్న వాళ్లకు నేరుగా 20 శాతం వెంటనే పెంచుతాం. రెండో సంవత్సరం పెంపు ఉండదు. మూడో ఏడాది మరో 5 శాతం పెంచుతాం. చిన్న సినిమాలకు పాత వేతనాలే కొనసాగుతాయి. రోజుకు నాలుగైదు వేల రూపాయలు తీసుకుంటున్న వారికి వేతనాలు పెంచమనడం సరికాదు. మేం కార్మికుల ముందు నాలుగు షరతులు పెట్టాం. అవి ఒప్పుకొంటే ఈ పెంపు వెంటనే అమలవుతుంది. చిన్న సినిమా అంటే ఎంత బడ్జెట్ అనే దానిపై పూర్తి వివరాలు త్వరలోనే ప్రకటిస్తాం.' అని అన్నారు.

అంగీకరించం: ఫెడరేషన్ నేతలు..

వేతనాల పెంపు విషయంలో నిర్మాతల నిర్ణయాన్ని అంగీకరించేదిలేదని ఫెడరేషన్ నేతలు తేల్చి చెప్పారు. నిర్మాతలు విధించిన షరతులకు ఒప్పుకొనేది లేదన్నారు. ఫెడరేషన్‌ను విభజించేలా, యూనియన్ల ఐక్యతను దెబ్బతీసేలా నిర్మాతల నిర్ణయాలు ఉన్నాయని ఆరోపించారు. రోజువారీ వేతనాలు తీసుకునే 13 సంఘాలకు ఒకే విధంగా పెంచాలని డిమాండ్ చేశారు. ఆదివారం నుంచి తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామన్నారు.

ఈనెల 4 నుంచి కార్మికుల పక్షాన ఫెడరేషన్ పిలుపునివ్వగా 24 క్రాఫ్ట్‌ల పరిధిలోని 11 యూనియన్లు ఇందులో భాగస్వామ్యమయ్యాయి. ఈనెల 4న 7, 5న 8, 6న 22, 7న 20, 8తో కలిపి 26 సినిమాల షూటింగ్‌లు కొనసాగుతున్నాయి. శనివారంనాడు సీనియర్ నటుడు చిరంజీవి ఇదే విషయమై స్పందించారు. 'పరిశ్రమ మొత్తానికి సంబంధించిన విషయం. వ్యక్తిగతంగానైనా ఏకపక్షంగా ఇలాంటి సమస్యలకు హామీ ఇవ్వడం లేదా పరిష్కారం చూపడం సాధ్యం కాదు. తెలుగు చిత్ర పరిశ్రమలో ఫిల్మ్ ఛాంబరే అగ్ర సంస్థ. అన్ని సమూహాలతో చర్చలు జరిపి న్యాయ సమ్మతమైన పరిష్కారానికి రావడం ఫిల్మ్ ఛాంబర్ సమష్టి బాధ్యత' అని తన ఎక్స్‌ఖాతాలో పేర్కొన్నారు. ఇప్పటికే నిర్మాతల మండలి తరపున ప్రతినిధులు, పలువురు నిర్మాతలు ఇప్పటికే చిరంజీవి, బాలకృష్ణ, పవన్‌కళ్యాణ్‌తో చర్చలు జరిపారు. శనివారం సాయంత్రం తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఇదే విషయమై తెలంగాణా రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటుగా మరికొందరు సహకారులతో టాలీవుడ్ సంక్షోభంపై చర్చించారు.

కొలిక్కి వచ్చేనా?

30 శాతం వేతనాల పెంపు వ్యవహారం ఇప్పటిది కాదు. గతంలో నిర్మాతల మండలి–ఫిలిం వర్కర్స్ ఫెడరేషన్ మధ్య జరిగిందే. దీనికి అనుగుణంగా షూటింగ్‌లు, వర్కర్ల కేటాయింపులు, వేతనాలు ఇతరత్రా అంశాలు కొనసాగుతున్నాయి. హీరోలు, హీరోయిన్లతోపాటుగా టెక్నీషియన్లకు భారీ మొత్తాలు ముట్టజెబుతున్న నిర్మాతలు సెట్లో పనిచేస్తున్న కార్మికుల పట్ల చిన్నచూపు చూస్తున్నారు. పైగా ఇప్పుడు అసంబద్ధమైన నాలుగు కొత్త షరతులు తెరపైకి తెచ్చారు. వాటిలో 1.ఫ్లెక్సిబుల్ కాల్షీట్లు పేరుతో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పనివిధానం. 2.నిపుణులు లేకపోతే నాన్‌మెంబర్స్‌తో పనులు. 3.సెకండ్ సండే.. పబ్లిక్ హాలిడేస్‌లో డబుల్ కాల్షీట్లు. 4.మిగిలిన ఆదివారాల్లో సింగిల్ కాల్షీట్‌గానే పరిగణన. ఈ నిబంధనలు కార్మికుల హక్కులను కాలరాసేవిగా ఉన్నాయి.

లీగల్ నోటీసులపై ఆగ్రహం

వేతనాలను పెంచాలంటూ తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళనకు దిగటంతో షూటింగ్‌లు నిలిచిపోయాయి. నిర్మాతల మండలి అసంబద్ధమైన వాదనలు చేస్తోందనీ, వేతనాలు పెంచేవరకూ పనుల్లోకి ఎట్టి పరిస్థితుల్లో వెళ్లబోమని కార్మికులు చెబుతున్నారు. పీపుల్స్ మీడియా అధినేత టిజి విశ్వప్రసాద్ కార్మికుల ఆకస్మిక సమ్మె కారణంగా రోజుకు రూ.కోటి నష్టపోతున్నానని కేసు పెట్టారు. ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షులు అనిల్, కార్యదర్శి అమ్మిరాజు, కోశాధికారి అలెక్స్‌కు లీగల్ నోటీసులు పంపారు. తాము న్యాయసమ్మతంగా చర్చలకు సిద్ధంగా ఉన్నామనీ, నిర్మాతల మండలితో మాట్లాడు తున్న తరుణంలో ఇలా కోర్టుకు వెళ్లటం ఏమిటని కార్మికులు మండిపడుతున్నారు.

ప్రముఖులు రంగంలోకి దిగేనా?

'అఖండ 2' షూటింగ్‌లో ఉన్న కథానాయకుడు నందమూరి బాలకృష్ణతో ఇప్పటికే నిర్మాతల మండలి ప్రతినిధులు ఈనెల ఆరోతేదీన కలిసి ఇదే విషయమై చర్చించారు. ఇరుపక్షాల కూర్చుని ఒక అంగీకారానికి రావటం మంచిదని ఆయన సలహా ఇచ్చారు. కార్మిక నాయకులు కూడా కలిసే ప్రయత్నం చేస్తున్నారు. ఫిల్మ్ ఛాంబరే చొరవ తీసుకోవాల్సివుందంటూ శనివారం చిరంజీవి చేసిన ప్రకటన కూడా చర్చనీయాంశంగా మారింది.

11 నుంచి ఉధృతంగా...

టిజి విశ్వప్రసాద్ వ్యాఖ్యలు సినీకార్మికుల పొట్టకొట్టేలా ఉన్నాయని సినిమా ఆర్టిస్ట్ యూనియన్ ప్రెసిడెంట్ టైగర్ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనకు సినిమా ఇండస్ట్రీపై అవగాహన లేదని, ఆయన ఫిలిం ఫెడరేషన్ నాయకులపై వేసిన కేసులు వెనక్కు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఆదివారంలోగా వేతనాల పెంపు జరక్కపోతే సోమవారం నుంచి పూర్తిగా షూటింగ్‌లు బంద్ పాటిస్తామని హెచ్చరించారు. ఉదయం కృష్ణానగర్ నుంచి ఫిలిం ఛాంబర్ కార్యాలయం వరకూ మహాపాదయాత్ర చేపడతామని ఫెడరేషన్ నాయకులు ప్రకటించారు.



విజయవాడ సన్ షైనర్స్ గెలుపు

- సెంచరీలు చేజార్చుకున్న పైలా అవినాష్, అశ్విన్ హెబ్బర్

ప్రజాశక్తి–ఎంవిపి కాలనీ (విశాఖ)

ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్–4లో భాగంగా శనివారం విజయవాడ సన్ షైనర్స్ – రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో విజయవాడ సన్ షైనర్స్ బ్యాటర్లు అశ్విన్ హెబ్బర్ (98), సాయి పూర్ణతేజ (77) అద్భుత బ్యాటింగ్‌తో రాణించారు. దీంతో విజయవాడ సన్‌షైనర్స్ జట్టు మరో 19 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేధించి ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 196 పరుగులు చేసింది. రాయల్స్ ఆఫ్ రాయలసీమ జట్టు బ్యాటర్లు పైలా అవినాష్ 39 బంతులల్లో 11 సిక్స్‌లు 4 ఫోర్‌లతో 96 పరుగులు, పి.గిరినాథ్ రెడ్డి 23 బంతులలో 3 సిక్స్‌లు, 5 ఫోర్‌లతో 49 పరుగులు చేసి జట్టు భారీ స్కోర్ సాధించడంలో కీలకపాత్ర పోషించారు. విజయవాడ సన్ షైనర్స్ జట్టు బౌలర్లు కె.ఎస్.ఎన్ రాజు 2, లలిత్ మోహన్ 2 వికెట్లు సాధించగా వై.పృథ్వీరాజ్ ఒక వికెట్ సాధించాడు. 197 పరుగుల భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన విజయవాడ సన్ షైనర్స్ జట్టు 16.5 ఓవర్‌లలో 3 వికెట్లు నష్టపోయి 200 పరుగులు చేసి విజయాన్ని నమోదు చేసుకుంది. విజయవాడ సన్ షైనర్స్ బ్యాటర్లు అశ్విన్ హెబ్బార్ 48 బంతుల్లో 9 సిక్స్‌లు, 6 ఫోర్‌లతో 98 పరుగులు, జి.సాయి పూర్ణ తేజ 37 బంతుల్లో 6 సిక్స్‌లు, 4 ఫోర్‌లతో 77 పరుగులు చేసి జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించారు. రాయల్ ఆఫ్ రాయలసీమ బౌలర్‌లలో జరగర్లపూడి రామ్ 3 వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌కు సంబంధించి పవర్ ఫుల్ స్ట్రైకర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డును పైల అవినాష్, బెస్ట్ ఎకానమీ అవార్డు ఎ.లలిత్ మోహన్, క్యాచ్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు ఎడ్ల వాసు, ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అశ్విన్ హెబ్బర్ సొంతం చేసుకున్నారు.



విజయం సాధించిన విజయవాడ సన్ షైనర్స్ జట్టు

ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లిన
ఆటగాళ్లందరికీ విశ్రాంతి

- ఆసియా కప్‌కు జట్టు ప్రకటనపై ఉత్కంఠ

ముంబయి: ఆసియాకప్‌కు భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) జట్టును ఇంకా ప్రకటించ లేదు. కానీ సెలెక్టర్లు జట్టు ఎంపికపై ఒక అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లిన ఆటగాళ్లందరికీ ఈ టూర్‌కు విశ్రాంతినివ్వాలనే ఉద్దేశ్యంతో సెలక్షన్ కమిటీ ఉంది. అదే జరిగితే ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లిన ఏ ఒక్కరికీ ఆసియాకప్ తుది జట్టులో చోటు దక్కే ఛాన్స్ దక్కకపోవచ్చు. శుభ్‌మాన్ గిల్ ఇంగ్లండ్ పర్యటనలో అత్యధికంగా 754 పరుగులు చేశాడు. దులీప్ ట్రోఫీలో నార్త్‌జోన్‌కు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. దీంతో అతడిపై పనిభారం మరింత పెంచడం ఇష్టంలేని సెలెక్షన్ కమిటీ అతడికి విశ్రాంతినివ్వాలనే ఉద్దేశ్యంలో ఉంది. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఇంగ్లండ్ పర్యటనలో రాణించినా.. ఆసియాకప్ తర్వాత స్వదేశంలో వెస్టిండీస్ జట్టు భారత పర్యటనకు రానుంది. ఆ టెస్ట్ సిరీస్‌కు అతడిని ఫిట్‌గా ఉంచాలనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, రవీంద్ర జడేజా ఈ ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పిన దృష్ట్యా వారి పేర్లు పరిశీలనలో లేవు. ఇక వికెట్ కీపర్ కోటాలో ముందుండే కెఎల్ రాహుల్‌ను దులీప్ ట్రోఫీలో ఆడించి వెస్టిండీస్ పర్యటనకు ఎంపిక చేయొచ్చు. టి20 ఫార్మాట్‌లో నాణ్యమైన బ్యాటర్లు టీమిండియాకు ఉన్న దృష్ట్యా మూడు ఫార్మాట్‌లకు మూడు జట్లను ఎంపికయ్యే ఆటగాళ్లు భారతజట్టుకు దొరకడం ఒక రకంగా మంచిదే. టి20 కెప్టెన్ సూర్యకుమార్‌తోపాటు టాప్, మిడిల్ ఆర్డర్ దుర్భేద్యఫామ్‌లో ఉండడమే ఇందుకు ప్రధాన కారణం. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో తిలక్ వర్మ, శ్రేయస్ అయ్యర్, రింకు సింగ్ ఎంపిక ఖాయమే. ఓపెనర్లుగా అభిషేక్ శర్మ, సంజు శాంసన్‌తోపాటు ముగ్గురు ఆల్‌రౌండర్లు, ఇద్దరు వికెట్ కీపర్లు, ఇద్దరు ప్రధాన పేసర్లతో ఆసియాకప్‌లో టీమిండియా బరిలోకి దిగనుంది. ఆగస్టు రెండో వారంలో జట్టును ప్రకటించే ఛాన్స్ ఉంది.





న్యూజిలాండ్ రికార్డు

- రెండో టెస్ట్‌లో జింబాబ్వేపై ఇన్నింగ్స్ 359 పరుగుల తేడాతో గెలుపు
- సిరీస్ 2–0తో కివీస్ కైవసం

బులవాయో: రెండో టెస్ట్‌లో న్యూజిలాండ్ జట్టు రికార్డు విజయాన్ని నమోదు చేసుకుంది. రెండో ఇన్నింగ్స్‌లో జింబాబ్వేను కేవలం 28.1ఓవర్లలోనే 117పరుగులకు ఆలౌట్ చేసి ఇన్నింగ్స్ 359పరుగుల తేడాతో న్యూజిలాండ్ జట్టు ఘన విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోర్ 3వికెట్ల నష్టానికి 601 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసిన న్యూజిలాండ్ జట్టు జింబాబ్వేపై 476పరుగుల భారీ ఆధిక్యతను సంపాదించింది. శనివారం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన జింబాబ్వేను ఫౌల్కెస్(5/37)కి తోడు హెన్రీ, డఫీ రెండేసి వికెట్లు తీసి కట్టడి చేశారు. ఇక జింబాబ్వే జట్టులో వెల్చ్(47), కెప్టెన్ ఎర్విన్(17) మినహా.. మిగిలిన బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. దీంతో న్యూజిలాండ్ జట్టు ఇన్నింగ్స్ 359పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను న్యూజిలాండ్ జట్టు 2–0తో చేజిక్కించుకొంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కాన్వేకు, సిరీస్ హెన్రీకి దక్కాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68